POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
డిసెంబర్ 2021
వెల – ₹ 10.00

సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 39 సంచిక: 08

శ్రీ మాణిక్య ప్రభువుల ఆరాధన : మార్గశిర శుద్ధ ఏకాదశి (14-12-2021)
శ్రీ మాణిక్య ప్రభువుల జయంతి : మార్గశిర పౌర్ణమి (18-12-2021)

పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ తల్లితో మాణిక్యనగర్ యాత్ర - ఏప్రిల్ 2013

ఈ లోక కళ్యాణకార్యం దిగ్విజయం కావాలి!

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ఒకసారి ద్వారకామాయిలో సాయి పాదాలొత్తుతూ వున్న బాపూసాహెబ్‌జోగ్ మనస్సులో ఒక ప్రశ్న ఉదయించింది – "సాయిని దర్శిస్తున్న వారందరూ పరమార్థం పొందుతారా?" అని. వెంటనే సాయి అతనితో "మామిడిచెట్టు ఎంత పూత వేస్తుందో చూడు. అవన్నీ పండ్లు అవుతాయా? గాలి, వాన, పురుగులు, పిట్టలు, కోతులవలన ఆ పూతలో ఎక్కువభాగం పండ్లవకుండానే రాలిపోతుంది. ఏవో కొద్ది మాత్రం చెట్టు నంటిపెట్టుకుని పండ్లవుతాయి. ఈ విషయం గూడ అలాంటిదే!" అన్నారు. అంటే తీర్థయాత్రలు, పూజలు, భజనలు చేసే వారెందరున్నా చివరిదాకా నిలచి పరమార్థం చేరేవారు బహుకొద్ది మందేనని వారి భావం. అందుకే శ్రీకృష్ణుడు గూడ, "మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే – వేలమంది మానవులలో ఏ ఒక్కరో ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నించే వారుంటారు" అన్నారు.

ఇందుకు కారణం సరియైన భగవదారాధనపద్ధతి తెలియపోవడమే. పామరులను శీతోష్ణాలు, రాగద్వేషాలు, మానావమానాలు, జయాపజయాలు, ఇంద్రియ విషయాలు చలింపజేసి విఫలం జేస్తుంటాయి. ఇందుకు బలమైన కారణమున్నది. మనలో యీ ద్వంద్వాలను ప్రేరేపించే జగత్తు మనకు ప్రత్యక్షం. పరమాత్మ ఎప్పుడూ యింద్రియాలకూ మనస్సుకూ గోచరించనివాడే. కనుక ఆయనపై దృఢమైన విశ్వాసమూ, శ్రద్ధ కల్గడం కష్టం. జీవితంలో ఎంత చిన్న కష్టమొచ్చినా ఆయనొకడున్నాడా? అన్న సందేహం కల్గుతుంది. సుఖం కల్గినప్పుడు పామరులకు ఆయనను హృదయపూర్వకంగా గుర్తించుకోవలసిన అవసరమే కలగదు. ఎవరైనా గుర్తుంచుకొన్నా, అది కష్టాలలో ఆర్తితో శరణు పొందడంలాగా మాత్రముండదు. కొంతమందికి కష్టాలు తీరినప్పుడు మాత్రమే భగవంతుడున్నాడనీ, తీరనప్పుడు లేడని అన్పిస్తూంటుంది. దీనిని భక్తి అనజాలము. భగవంతుడున్నాడన్న దృఢ విశ్వాసం స్థిరపడకపోవడమే మనలోని లోపం. అట్టి విశ్వాసాన్ని కల్గించేది ఒక సద్గురుడే. వారిలో ప్రత్యక్షంగా దైవమున్నాడన్న సత్యాన్ని దర్శించవచ్చు. రామకృష్ణ పరమహంస తారసిల్లి భగవదనుభూతి ప్రసాదించేదాకా వివేకానందునికి అట్టి విశ్వాసం ఏర్పడలేదు, ఇక మన సంగతి చెప్పాలా? అందుకే అట్టి మహాత్ముల దర్శనం అన్నింటికంటే శ్రేష్ఠమైనదని శ్రీ గురుచరిత్ర, శ్రీ గురుగీత చెబుతాయి.

శ్రీకృష్ణుడు విశ్వరూప దర్శన మిచ్చేవరకూ ఎప్పుడూ ఆయనచెంతనే వుండే అర్జునుడికి గూడ యుద్ధరంగంలో మమకారం కమ్మి ధర్మం అధర్మంగానూ, అధర్మం ధర్మం గానూ గోచరించిందని భగవద్గీతలో మొదటి అధ్యాయం చూస్తే తెలుస్తుంది. అందుకే కృష్ణుడు గూడ తత్వదర్శి యైన సద్గురువును శరణుబొంది సేవించి పరిప్రశ్న చేసి జ్ఞానం పొందమని అత్యంత ఆప్తుడైన అర్జునుని ఆదేశించాడు (గీత : 4:34). ఈ రీతిన నారదుడు, శ్రీకృష్ణుడు, రామకృష్ణ పరమహంసవంటి తత్వదర్శులను ఆశ్రయించిన ధ్రువుడు, వాల్మీకి, అర్జునులనుండి వివేకానందుని వరకు అట్టి సాధకులుమాత్రమే సుస్థిరమైన ఆధ్యాత్మిక జీవితం సాధించుకోగల్గారు.

సాయిబాబాకూడా తమ గురుసేవా వృత్తాంతంలో ఈ విషయమే స్పష్టం చేసారు. నల్గురు ముముక్షువులు మొదట సద్గ్రంథపఠన చేసి, ఉత్తేజితులై

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:39 డిసెంబర్-2021 సంచిక:08

పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన 'సాయిబాబా'

విషయ సూచిక

01.	**ఈ లోక కళ్యాణకార్యం దిగ్విజయం కావాలి!**	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	*03*
02.	**శ్రీ సద్గురు శ్రీ మాణిక్య ప్రభువు**	"సాయిబాబా"	*06*
03.	**పరిప్రశ్న**	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	*08*
04.	**సద్గుర్వనుగ్రహము**	పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ	*09*
05.	**వార్తాలాపము**	శ్రీమతి అడిదం వేదవతి	*12*
06.	**మాతృదేవి స్మృతులు**	శ్రీ ఎస్ వి రాంప్రసాద్	*15*
07.	**ప్రేమ స్వరూపుడు**	శ్రీ కె. ఎస్.ప్రసాద్	*18*
08.	**నార్కే**	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	*22*
09.	**ద్వారకామాయి అనుభవమండపము**	జీ.వి. వైద్య; రచయిత విఠల్‌రావ్ పవార్	*26*
10.	**ఆచార్యుని అద్భుత లీలలు**	శ్రీ మోహన్ రెడ్డి ; శ్రీమతి రాధ మనోరంజని దేవి	*28*

చిరునామా

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

www.saibharadwaja.org
www.saimasterforums.org

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి	:	రూ. 10-00
సంవత్సర చందా	:	రూ. 100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

పరమాత్మాన్వేషణకోసం అడవికి వెళ్ళారు. అపుడు మారువేషంలో వారికి గురువు ఎదురయ్యారు. పూర్మజన్మ సంస్కారం వలన ఆయనను ఆశ్రయించగల్గిన బాబా మాత్రమే కృతార్థులై సద్గురువుగా రూపొందగల్గారు. విద్యాగర్వంతో (అంటే తమకే అన్నీ తెలుసన్న భావంతో) మిగిలిన ముగ్గురు ఆ గురువును ఆశ్రయించక శాశ్వతంగా సంసారమనే అరణ్యంలో ఆకలిదప్పులతో పరిభ్రమిస్తూ వుండిపోయారు. బాబావలె సద్గురువును ఆశ్రయించగలవారు వేలాది భక్తులలో ఏ ఒక్కరో వుంటారు. వారు మాత్రమే కొద్దిపాటి మామిడిపూతవలె స్థిరంగా ఆధ్యాత్మ మార్గంలో నిలచి ఆత్మజ్ఞానం పొంది పండ్లవుతారు.

అంటే సద్గురువును ఆశ్రయించటమొక్కటే ఆత్మజ్ఞానానికి మార్గమన్నమాట. కాని ద్వాపర యుగంలోనే ఇలా చేసేవారు కొన్ని వేలమందికి ఒక్కరుంటే ఈ కలియుగంలో ఎంతమంది వుంటారన్నది మనము ఊహించవచ్చును. కనుకనే ఈ యుగంలో ధనము, కీర్తి ఆశించి ఆత్మజ్ఞానం పొందకుండానే గురువులుగా చెలామణీ అయ్యే వారెందరో వుండబోతారని పురాణాలేగాక ఆదిశంకరులు, కబీరు, భర్తృహరి, యోగివేమన రామకృష్ణ పరమహంస, రమణమహర్షి వంటి మహాత్ములు మనల్ని హెచ్చరించారు. సాయిబాబా కూడా అందుకే "ఈ రోజుల్లో నిజమైన ఫకీరు (ఆత్మజ్ఞాని) లభించడమెంతో అరుదు" అన్నారు.

ఇందుకు మరో కారణం వున్నది, 'శ్రీ గురుచరిత్ర' లో శ్రీ గురుడు పంచ గంగాసంగమమైన నర్సోబావాడీలో గుప్తంగా వుండదలచారు. అప్పుడు ఒక భక్తుని ఆదుకొనడానికి ఆయన చేసిన లీలవలన వారి లీల ప్రకటమయి జనం వారి చెంతకురానారంభించారు. అప్పుడు ఆయన ఇలా అనుకొన్నారు, "ఇక్కడకు భక్తులు, ఆర్తులతో పాటు స్వార్థంతో దుష్టులు కూడా వస్తారు. వారి వలన సద్భక్తుల కెంతో కష్టం కలుగుతుంది. కనుక నేను ఈ చోటు విడిచిపోవాలి". అంటే కలియుగంలో ఆత్మజ్ఞానం పొందిన కొద్ది మంది ఆదిశంకరులు చెప్పినట్లు, "బాలోన్మత్త పిశాచవత్" – పసిపిల్లలవలె, పిచ్చివానివలె, పిశాచగ్రస్తులవలె జనుల దృష్టి నుండి గుప్తంగా సంచరిస్తారు. గనుక వారి సేవ మనకు దొరకడం కష్టం. అందుకే దత్తాత్రేయస్వామి లోకోద్ధరణ కోసం సుమారు 6 శతాబ్దాలలో 5 సార్లు అవతరించవలసి వచ్చినది. ఆ దత్తావతారాలే ఈ యుగంలో మన మాశ్రయించదగిన సత్పురుషులు. వారి భౌతిక రూపాలు అదృశ్యమయ్యాక కూడా వారి చరిత్రల పారాయణ ద్వారా వారి ప్రత్యక్ష సాన్నిధ్యాన్ని పొంది మనము కృతార్థులమవ్వచ్చునని శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామి, శ్రీ రంగావధూత, శ్రీ నానేమహరాజ్, శ్రీ నారాయణ మహరాజ్ (ఖేడ్ గావ్ భేట్) వంటివారి అనుభవాలు నిరూపిస్తున్నాయి. 'శ్రీ గురుచరిత్ర' శ్రద్ధగా పారాయణ చేస్తే శ్రీ గురుడే మనకు సద్గురువును చూపుతారు.

అయినా మన సమస్య అంతటితో తీరదు. సద్గురువు తారసిల్లినా, ఆయనను తగురీతిన సేవించగల్గడానికి ఎంతో సంస్కారబలం కూడా కావాలి. వారి గురువుకు అంతటి సమర్థుడైన శిష్యుడిగా సాయిబాబా ఒక్కరే నిలచి సేవించుకోగల్గారు. వారికి ఎందరు భక్తులున్నా అలా వారిని సేవించగలవారు ఒక్కరు కూడా లేరని సాయిబాబా చెప్పారు. సద్గురువు లభించినా, ఆయనను తగు రీతిన సేవించగల్గడానికి తగిన సంస్కారము గూడా 'శ్రీ గురుచరిత్ర' మొదలైన దత్తావతారాల చరిత్రల పారాయణయే ప్రసాదించగలదు. ఐహికము, పారమార్థికమైన మానవ శ్రేయస్సును సాధించడానికి తమను తామే దత్తం చేసుకొన్న, ఆత్మసమర్పణ చేసుకొన్న భగవదవతారమే దత్తాత్రేయుడు. కనుక రానున్న దత్తజయంతి సందర్భంగా మనము కూడా వ్రతముబూని చరిత్ర పారాయణచేసి కృతార్థుల మవుదాము. దత్తజయంతికి ముగిసేలాగ గాని, నాటితో ఆరంభించిగాని 'శ్రీ గురుచరిత్ర' 'దత్తావతార మహాత్మ్యం', 'స్వామిసమర్థ చరిత్ర', 'శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర' వరుసగా ఒకదాని తర్వాత ఒకటి పారాయణ చేస్తుండటమే ఈ వ్రతం. శ్రీ వాసుదేవానంద సరస్వతి స్వామి మొదలైన వారివలె దత్తస్వామిని ప్రత్యక్షం చేసుకొనడమే మన ప్రధాన సంకల్పం కావాలి. ఈ సంప్రదాయం వర్ధిల్లి లోక కళ్యాణం జరగాలి. నిత్యము పారాయణ చివరిలో "సర్వేజనాః సుఖినో భవంతు" "లోకా సమస్తాః సుఖినో భవంతు" అన్నదే చరమ సంకల్పం కావాలి. అదే నిత్యము పూజ ముగించే ముందు "సర్వం శ్రీ పరమేశ్వరార్పణమస్తు" అని మనము చెప్పుకొనే సంకల్పానికి అర్థం.

శ్రీ సద్గురు శ్రీ మాణిక్య ప్రభువు

"సాయిబాబా"

హైదరాబాదుకు చెందిన అప్పారావు, భీమాబాయి అను దంపతులు శ్రీమంతులు. వారెన్ని వ్రతాలు, పూజలూ చేసినా సంతానం కల్గలేదు. అప్పుడు గుల్బర్గా దగ్గరున్న 'కల్యాణ్'లో దివ్యశక్తులుగల ఒక బాలుడున్నాడని తెలిసి అతని దర్శనానికి పల్లకీలో బయల్దేరింది భీమాబాయి. దారిలో ఒక చోట కొందరు పిల్లలు కలసి ఒక పిల్లవాణ్ణి కొడుతున్నారు. వారి తగవు తీర్చిరమ్మని భీమాబాయి ఒక నౌకరును పంపింది. అతడితో ఆ దెబ్బలు తింటున్న పిల్లవాడు, "నేను ఈ పిల్లలతో పందెంలో ఓడిపోయినాను. 8 గవ్వలిచ్చి నన్ను విడిపిస్తే మీ యజమానురాలికి 8 మంది పిల్లలు కల్గుతారు" అన్నాడు. తరువాత భీమాబాయి తన నౌకరు ద్వారా గవ్వలు ఆ బాలునికిచ్చింది. అతడు వెంటనే అవి ఆ పిల్లలకిచ్చి ఎటో పరుగెత్తిపోయాడు. తర్వాత భీమాబాయి కల్యాణ్ చేరి 3 రోజులు వేచియున్నాక ఆ దివ్య బాలుడు ఎక్కడనుండో వస్తూనే ఆమెను చూచి, "నీకిదివరకే 8 మంది బిడ్డలనిచ్చానుగదా! ఇంకా వేధిస్తావెందుకు?" అని చెప్పి మళ్ళీ ఎటో వెళ్లిపోయాడు. కాలాంతరంలో అతడి మాటలక్షరాలా నిజమయ్యాయి. ఈ దివ్యబాలుడే మూడవ దత్తావతారమైన శ్రీ సద్గురు మాణిక్య ప్రభువు.

మాణిక్యప్రభువు డిసెంబరు 22, 1817న కల్యాణ్‌లో మనోహర్‌నాయక్, బయాదేవి అను పుణ్యదంపతులకు జన్మించారు. వీరి అన్నగారైన హనుమంత్ దాదా తర్వాతకాలంలో మారుతి అవతారంగా కొలువబడిన 'శ్రీ దాదామహరాజ్' అను మహనీయుడుగా ప్రసిద్ధి చెందారు. వీరి సమాధి మాణిక్యనగర్‌కు తూర్పున విరజా-గురుగంగ అను ఉపనదుల సంగమం వద్దనున్నది. మాణిక్య ప్రభువులకు ఉపనయమైన కొద్దికాలానికి తండ్రి స్వర్గస్థుడయ్యాడు. ప్రభువు బడికి వెళ్ళక ఒక్కడే భయంకరమైన అడవులలోకి వెళ్ళి కొన్ని రోజుల తర్వాత ఇల్లు చేరుతుండేవారు. ఆ బాలుని సంస్కరించమని కోరి, తల్లి బయాదేవి అతనిని దీక్షిత్ అను వేదపండితుని యింటికి పంపింది. ఆ బాలుని దివ్యత్వాన్ని గుర్తించిన దీక్షిత్ అతడికెందులోనూ అడ్డు చెప్పేవాడుగాదు. ఒకనాడు ఆ బాలుడు హోమగుండంలో మలవిసర్జన చేసాడు. దీక్షిత్ ఆ సంగతి తెలిసి హోమగుండంలో చూడగా అందులో మలానికి బదులు బంగారు ముద్ద వున్నది.

ఎట్టి ఆధారమూ లేని ఆ కుటుంబాన్ని మేనమామ చాలీచాలని తన జీతంతో పోషించేవాడు. ఒకసారి అతడు యుక్త వయస్కుడవుతున్న మాణిక్య ప్రభువును రహదారిపై పోయే వాహనాల మీద పన్ను వసూలు చేసే పనిలో చేర్పించాడు. కాని అతడు తాను వసూలు చేసినదంతా పేదలకిచ్చేస్తూంటే ప్రభుత్వం అతనిని ఉద్యోగం నుంచి తొలగించింది. అందుకాగ్రహించి అతనిని ఇంట్లో నుండి వెళ్ళిపొమ్మని మేనమామ బెదిరించాడు. వెంటనే ఆ యువకుడు ఆశువుగా వేదాంతముట్టిపడే ఒక పద్యం చెప్పి, మేనమామకు ప్రదక్షిణం చేసి కేవలం కౌపినంతో యింటిలో నుండి వెళ్ళిపోయాడు. ఆ

తర్వాత మాణిక్య ప్రభువు యథేచ్ఛగా అరణ్యాలలోనూ, గుహలలోనూ సంచరిస్తూ, ఎన్నో లీలలు ప్రకటించారు. ఎందరో భక్తులు వారిని దర్శించి తమ కష్టాలు తీర్చుకునేవారు. ఆయన పరలీవైద్యనాథము, తులజాపూర్, పండరిపూర్, పూనా, తిరుపతి, గాణ్గాపూర్, కోల్హాపూర్, నృసింహవాడీ మొ॥న ప్రాంతాలలోనేగాక ఉత్తరదేశంలో గూడ పర్యటించారు.

స్వామిని వెంకమ్మ అను బాల్య వితంతువు దర్శించి ఆ సన్నిధిలోనే జీవితశేషం గడపాలని కోరింది. వారు "మా సన్నిధిలో వుండాలంటే నీ వద్ద నగలుంచుకోరాదు" అన్నారు. ఆమె తన బంగారమంతా ప్రభువులవద్ద వుంచేసింది. ఆయన దానిని పేదలకు పంచివేసి ఆమెను తమ తల్లివద్ద ఉంచాడు. దొంగ ఒకడు శ్రీమంతులైన ఆమె కుటుంబమంతటినీ బొందితో కైలాసానికి పంపిస్తానని నమ్మించి, మైలారులోని రుద్రకుండంలో దూకించాడు. వారు దూకగానే వారింట్లోని బంగారమంతా తీసుకుని పరారయ్యాడు. అందరూ చనిపోయారుగాని, ఒక చిత్రమైన వ్యక్తి వెంకమ్మను మాత్రం రక్షించి అదృశ్యమయ్యాడు. కొంతకాలానికి ఆమె ప్రభువులను దర్శించి, తనను రక్షించినది వారేనని గుర్తించి, వారి సేవలో వుండిపోయింది. ఆయన సేవలో ఆమెకు యోగ సమాధి లభించి, ఆయన సన్నిధిలోనే సమాధియైంది.

ఒకప్పుడు బీదర్‌కు చెందిన ధనికులెందరో ప్రభువుల నాహ్వానించి ఏనుగుల ఊరేగింపుతో పల్లకిలో ఆయనను తీసుకువెళుతున్నారు. దారిలో ఒకచోట మేనా మోసే వారందరికీ మైకం కమ్మి వేరొకదారిన మళ్ళారు. అక్కడ వారికొక పెద్ద పాము కన్పించింది. అదొక గొప్ప మహనీయుడని చెప్పి దానిననుసరించమన్నారు ప్రభువు. అది ఒక నరసింహస్వామి దేవాలయం వద్దకుపోయి అదృశ్యమైంది. ప్రభువక్కడ కొంతకాలమున్నారు. అప్పుడు బీదర్ నుండి వచ్చిన భక్తులెందరో తమ యిండ్లకు స్వయంగా ప్రభువులు వచ్చారని చెప్పుకోసాగారు. వారి యోగ మహిమను గుర్తించి ముస్లిములు ఆయనను సేవించేవారు. అది నచ్చని కొందరు మౌల్వీలు ప్రభువులను భోజనానికి పిలిచారు. ఆయన అంగీకరించకుంటే ఆయన బోధించే మత సామరస్యం బూటకమని నిరూపించాలని తలచారు. ప్రభువు విందుకు హాజరై, ప్రార్థన చేసి, వంటకాలపై మూత తొలగించేసరికి ఆవు మాంసమంతా అదృశ్యమై, దానికిబదులు పెద్ద గులాబీలు, ఖర్జూరాలు, మిఠాయిలు వున్నాయి. అప్పటినుండి బీదర్‌కు చెందిన ముస్లిములు ఆయనను ముస్లిం మహాత్ముడుగా తలచి, 'పీర్-ఆన్-పీర్ దస్తగీర్' అను బిరుదునిచ్చారు. తర్వాత ఆయన మేనాలో హుమ్నాబాద్ సమీపించేసరికి అక్కడ దట్టమైన లతలమధ్య మేనా చిక్కుకుని కదలలేదు. అప్పటినుండి ప్రభువులు శాశ్వతంగా అక్కడే స్థిరంగా వుండిపోయారు. అదే నేటిమాణిక్య నగరం. అక్కడికే ఎందరో భక్తులు రాసాగారు. ఆయన అక్కడ 'దత్తగాదీ' (దత్త సింహాసనము) ప్రతిష్ఠించారు.

అద్భుతమైన ప్రభువుల మహిమవలన అన్ని మతాలవారూ ఆయన నాశ్రయించారు. ఆయనగూడ సకలమత సామరస్యమే బోధించారు. అందుకే హిందూ పండుగలతో పాటు అక్కడ మొహరం చేస్తారు. పండగలలో వారి సన్నిధిలో వేదగానము, శాస్త్రచర్చ, నృత్యగీతాదులు మహావైభవంగా జరిగేవి.

ఒకప్పుడు అక్కల్కోటరాజు ప్రభువులను దర్శించి, తమ పట్టణాని కాహ్వానించారు. ఆయన, "నా మరొకరూపం అక్కడికి వస్తారు" అని చెప్పారు. ఆ ప్రకారమే కొంతకాలానికి అక్కల్‌కోట స్వామి నాల్గవ దత్తావతారంగా అక్కడ ప్రకటమయ్యారు.

మరొకప్పుడు హంపీలోని శంకరాచార్య వీరిని కలుసుకుని వీరి మహిమను కీర్తించారు.

శ్రీ సద్గురు మాణిక్య ప్రభువుల సమాధి, వారి తర్వాత ఆ పీఠమలంకరించినవారి సమాధులు, శ్రీ దాదా మహరాజ్‌గారి సమాధి, యోగిని వెంకమ్మగారి సమాధి, మాణిక్య నగర్‌లో చూడవలసిన ప్రదేశాలు. మాణిక్య నగర్‌లో రోజూ 4 హారతులు జరుగుతాయి. శ్రీరామనవమి, గురుపూర్ణిమ, దత్తాత్రేయ జయంతి ముఖ్యమైన పండుగలు,

హైదరాబాదు నుండి గుల్బర్గా వెళ్ళే బస్సులో హుమ్నాబాద్ చేరాలి. అక్కడి నుండి బండి మీద 4 ఫర్లాంగుల దూరంలోనున్న మాణిక్యనగర్ చేరాలి.

పరిప్రశ్న

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

ప్రశ్న :-సాయిలాంటి పూర్ణపురుషులను మనసా, వాచా, కర్మణా శరణు పొందితే గత జన్మల కర్మలు, గ్రహబాధలు తొలగించబడతాయి అనే సిద్ధాంతము నిజమా?

- ఎమ్. రాధాక్రిష్ణ, హైదరాబాదు.

జవాబు:- మనలోనూ, అంతటా నిండియున్న ఒక పరమాత్మతత్వమే మనం శరణు పొందిన సద్గురువని గుర్తించి దానిననుసరించి నడుచుకొనడమే శరణు పొందడం. ఇందులో తన అభిప్రాయాలకు, యిష్టాయిష్టాలకు తావుంది. సద్గురువు బోధించిన రీతిన కర్మణా మనసా వాచా అనుక్షణమూ ఏమారక జీవించడము, అందులో వచ్చిన కష్టనిష్ఠూరాలను మన ప్రగతి కవసరమైన ఔషధము, అనుపానాలుగా సద్గురువు ప్రసాదించినవని గుర్తించి నడుచుకోవడమే శరణు పొందడమంటే.

ఇలా శరణు పొందడానికి హృదయ పూర్వకంగా ధ్యానము, పారాయణ, భావయుక్తమైన నామస్మరణ, పూజ, సత్సాంగత్యము, మన లౌకిక బాధ్యతలు ఆయన మనకు విధించిన కర్తవ్యంగా త్రికరణ శుద్ధిగా నిర్వర్తించడమూ అవసరము.

ఇలా జీవించ యత్నిస్తూ శరణాగతిని క్రమంగా నిర్దుష్టం చేసుకోవాలి. శరణాగతి సామాన్యంగా ఒక జన్మలో కుదిరేది కాదు. బహు జన్మల అభ్యాసమే యీ జన్మలో కొద్దిమంది మహనీయులలో మనకు కన్పించే శరణాగతి.

ఇలాంటి లక్ష్యంవైపుగా జీవితాన్ని కొనసాగించుకొనే దీక్షగల వారికి పూర్వకర్మ ఫలితాలు, సంస్కారాలూ తాము ఉన్నతి చెందటానికి అధిరోహించ వలసిన సోపానాలవుతాయి. అటువంటి కర్మదోషాలు, గ్రహబాధలు ఎదురైనపుడు సద్గురువును శరణు పొందని వారు రాగ, ద్వేష, అసూయ, భయాది దుష్ట సంస్కారాల చేత ప్రేరేపించబడి పనిచేస్తారు. కనుక తిరిగి మరుజన్మలకు అలాంటి అవరోధాలనే కల్పించుకొన్నవారవుతారు. అంతేగాదు తిరిగి తిరిగి అలా అవరోధాలను కల్పించుకోవడమే అభ్యాసము, లేక సంస్కారంగా ఏర్పడుతుంది. కనుక కర్మలు, గ్రహబాధలు సద్గురు భక్తుడికి సోపానాలు. కనుక వాటికా పేరు యిక తగదు. అంతేగాని ప్రత్యక్షంగా, స్థూలంగా ఫలితాలు తొలుగుతాయని గాదు. "చేసిన కర్మఫలం అనుభవింపక ఎన్నటికీ ఆగదు" అని నారికురుపుతో బాధపడుతున్న డా॥పిళ్ళేకు సాయిచెప్పినది మరువకూడదు. పామరుల కర్మ గ్రహబాధలు ప్రాణాలు తీసే విషం వంటివి; సద్గురు భక్తులకు అవే రోగాలు తగ్గించే మోతాదులు. నిపుణుడైన వైద్యుడుపయోగించే పాషాణాది ఔషధాలు నాశనానికి, రక్షణకు కూడ కారణమవగలవు. బాగా చదివేవాడికి పరీక్షలు పైకి పోయేందుకవసరము. చదవని అనర్హులు అక్రమంగా పై తరగతికి పోకుండా అవరోధం.

'కర్మ' అనే పదం ఏ కార్యకారణ సూత్రాన్ని తెలుపుతుందో - 'గ్రహబాధ' అన్నపదంతో దానినే ప్రత్యక్షంగా జన్మాంతరజ్ఞానం లేనివారు ఉరామరికగా అంచనావేసే పరోక్ష పద్ధతియైన 'జ్యోతిషశాస్త్రం' సూచిస్తుంది. ఒకటి పొడుగును అంగుళాలలో కొలిస్తే యింకొకటి సెంటీమీటర్లలో కొలుస్తుంది. ●

సద్గుర్వనుగ్రహము

_పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ_

(ఫిబ్రవరి 2010 సాయిబాబా మాసపత్రిక నుండి)

ఫిబ్రవరి తొమ్మిది. పూజ్యశ్రీ ఆచార్య భరద్వాజ మాస్టరుగారిని ఆరాధించేవారందరికీ అతి ముఖ్యమైన, ప్రీతికరమైన రోజు. కారణం ఆ రోజు పూజ్యశ్రీ మాస్టరుగారు శిరిడీలో లేకుంటే, శిరిడీ సాయిబాబా వలన అట్టి అనుభవాన్ని పొందకుంటే ఈ రోజు మనమిలా సాయిని సేవించేవాళ్ళము కాదేమో!

ఆ రోజు పూజ్యశ్రీ మాస్టరుగారు, శిరిడీ సాయిబాబా యొక్క పరిపూర్ణ అనుగ్రహాన్ని పొందిన రోజు. శిరిడీ సాయి సన్నిధిలో ఆయన ఆత్మానుభవాన్ని పొందినరోజు. ఆ క్షణం నుంచి ఆయన మనసా, వాచా, కర్మణా శ్రీ సాయినాథునికి అంకితమై ఆయన మహిమను దశదిశలా వ్యాపింపజేసారు.

ప్రథమ దర్శనంలోనే ఆయన అంతగా సాయినాథుని అనుగ్రహాన్ని ఎలా పొందగలిగారు? దానికి కారణాలేమిటి? అంటే అప్పటివరకూ పూజ్యశ్రీ మాస్టరుగారు చేసిన అన్వేషణ, సాధనలు ఫలించి ఆయనకు సాయి అనుగ్రహం లభించిందని ఒక్క మాటలో చెప్పుకోవచ్చు.

నిజానికి ఆయన చిన్నప్పటినుండీ అన్వేషకులే. చిన్నప్పుడు మాతృదేవి మరణంతో ప్రారంభమైన అన్వేషణ ఆయన అన్నగారి అబ్బాయి మరణంతో తీవ్రతరమైంది. దానితో ఆయన బుద్ధునివలెనే జనన మరణ చక్రాన్ని, సృష్టి తత్వాన్ని తరచి తరచి తెలుసుకున్నారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు మొదటినుంచీ ఏ విషయాన్నైనా క్షుణ్ణంగా తెలుసుకోనిదే వదిలి పెట్టేవారుగాదు. అన్ని విషయాలలోనూ ఆయనకు ప్రశ్నల చిట్టా వుండేది. సమాధానపడేవరకూ వదిలి పెట్టేవారుగాదు.

అందుకనే అసలు ఆధ్యాత్మికత అంటే ఏమిటి? ఆధ్యాత్మిక తత్త్వవేత్తలు ఎలా వుంటారు? భగవంతుడు వున్నాడా? ఉంటే ఎలా వుంటాడు? ఆయన తత్త్వమేమిటి? అని తెలుసుకోవడానికి ఎన్నో పుస్తకాలు చదివారు. ఆలోచించారు.

అసలు మతమంటే ఏమిటి? మతాలు ఎలా ఉద్భవించాయి? ఇన్ని మతాలు ఎందుకు ఏర్పడ్డాయి? అవి బోధించేదేమిటి? ఇవి తెలుసుకోడానికి మతాలగూర్చి అన్ని గ్రంథాలు చదివారు. వాటి తత్త్వాన్ని గూర్చి తెలుసుకున్నారు.

'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' అన్న వాక్యాన్ననుసరించి ఆయన కాలేజీ వయసులో వున్నప్పుడే మనస్సును గూర్చి ఆలోచించి దానిని తన ఆధీనంలోకి తెచ్చుకున్నారు. మనస్సు చెప్పినట్లు తాము వినకుండా తాము చెప్పినట్లు మనస్సు వినేలా చేసుకున్నారు. మనస్సుకు ఏది చేయాలనిపిస్తే దానికి వ్యతిరేకంగా చేసేవారు. కూర్చోవాలనిపిస్తే గంటల తరబడి నిలుచునేవారు. నిలబడాలనిపిస్తే కూర్చునేవారు. పడుకోవాలనిపిస్తే లేచి తిరిగేవారు. నిద్రపోవాలనిపిస్తే మెలుకువగా వుండేవారు. బయటకు వెళ్ళాలనిపిస్తే ఇంట్లోనే వుండేవారు. ఇంట్లో వుండాలనిపిస్తే బయటకు వెళ్ళేవారు. తినాలనిపిస్తే ఉపవాసం

వుండేవారు. తినవద్దు అనిపిస్తే విపరీతంగా తినేవారు. నడుస్తున్నప్పుడు కాసేపు ఆగుదామని అనిపిస్తే అలా అనిపించకుండా వుండేదాకా మైళ్ళ తరబడి నడిచేవారు.

అంతేగాదు, ఆయన ఎన్నో రోజులు ఆహారం తీసుకోవడం మానేసారు. కొంతకాలం ద్రవపదార్థాలు మాత్రమే తీసుకున్నారు. అలాగే కొన్ని రోజులు ద్రవపదార్థాలు అసలు తీసుకోకుండా ఘనపదార్థాలు మాత్రమే తీసుకున్నారు. అలాగే మూత్ర బంధనము, మలబంధనము చేసారు. మామూలుగా మానవుడు యివి జరగకుండా ఎన్నిరోజులు జీవించగలడో అన్ని రోజులకంటే మూడురెట్లు ఎక్కువగా యివన్నీ చేసారు. నిద్రలేకుండా ఎన్నో రోజులు గడిపారు. అంతేగాక ఆయన చేసిన సాధనలు ఎన్నో వున్నాయి.

అంటే ఆయన కోరికలను నశింపజేసారు. కోరిక ఎప్పుడైతే నశిస్తుందో, దాని వలన ఉద్భవించే రాగ, ద్వేష, అసూయాది భావాలు నశిస్తాయి. అందుకని ఇక సాధించడానికి ఆయనకు ఏమి మిగిలింది? అంటే ఆయన సాధనంతా పూర్తయిందన్న మాట! ఇక సద్గురువనుగ్రహమే కావాలసింది!

అందుకే – పూజ్యశ్రీ మాస్టరుగారు అట్టి అర్హత సంపాదించారు గనుకనే – శ్రీ శిరిడీ సాయినాథుడు ఆయనను తమ శిష్యునిగా అంగీకరించి తమ సంపూర్ణ అనుగ్రహాన్ని ప్రసాదించారు. తమవంటివారిని చేసారు.

ఇక్కడ కొందరికి ఒక సందేహము కలుగవచ్చు. 'శ్రీ సాయి పూజ్యశ్రీ మాస్టరుగారిని తమవంటివారుగా



చేస్తే ఆయన గూడ శ్రీ సాయిలాగా జీవించాలిగదా! మరి వేరుగా వున్నారెందుకు?' అని. ఈ ప్రశ్నకు సమాధానం సాయియే. శ్రీ సాయిని తమ గురువు పరిపూర్ణుని చేసారు. అయితే సాయి తమ గురువులాగా వున్నారా? ఎందుకుండలేదు? ఇక్కడ మనం గమనించవలసిన విషయమొకటున్నది. తమ గురువు వలన పరిపూర్ణులైనవారు గురువు వలె వుండరు. గురువు తమను ఎలా వుంచుతారో అలా వుంటారు! అదే విధంగా పూజ్యశ్రీ మాస్టరుగారు తమ గురువు తమను ఎలా వుంచారో అలా వున్నారు.

అసలు అనుగ్రహం అంటే ఏమిటి? పూజ్యశ్రీ మాస్టరుగారు అనుగ్రహం గురించి యిలా చెప్పారు: "భగవంతుని అనుగ్రహము నిరంతరం వర్షిస్తూనే వుంటుంది. దానిని గుర్తించడము, దానిని విశేషంగా పొందే యత్నం చేయడమే కావలసినది. ఈ రోజు మనం యిలా జీవించగలుగుతున్నామంటే అంతా ఆయన అనుగ్రహమే. మన చుట్టూ ఎప్పుడూ ఎన్నో ఉపద్రవాలు పొంచేవుంటాయి. వ్యాధులనుండి, ప్రకృతి వైపరీత్యాలనుండి, వ్యక్తులనుండి – యిలా ఎన్నో విధాల ఆయన మనలను కాపాడుతున్నారు. ఇది తెలుసుకుంటే భగవంతుడు మనలను ఎంతగా అనుగ్రహిస్తున్నారో అర్థమవుతుంది.

అంతేగాదు, మనకు వచ్చే కష్టాలు గూడ ఆయన అనుగ్రహమేనని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పేవారు. మనం చేసే పొరపాట్లకు ఆయన యిచ్చే శిక్ష, శిక్షణ గూడానని ఆయన చెప్పేవారు. చేసిన తప్పులను తెలుసుకోవడానికి, వాటిని తిరిగి చేయకుండా వుండడానికి మనం మన పిల్లలను ఎలా శిక్షిస్తామో అలాగే ఆయన గూడా చేస్తారని పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పేవారు. మనం సరియైన మార్గాన నడవడానికి అవి దోహదపడతాయని ఆయన చెప్పేవారు.

"అయితే పూజ్యశ్రీ మాస్టరుగారికి వచ్చినంతటి అనుగ్రహము మనకు

అవసరమా?" అని మనకనిపించవచ్చు. అలా అనిపించడమంటే ఏమిటంటే మనకు శాశ్వతమైన తృప్తి శాంతులు అవసరం లేదని మనమనుకుంటున్నామన్నమాట. మరొక రకంగా చెప్పాలంటే అంతటి తృప్తి శాంతిని పొందిన వారి వద్దనుండి మనం కొద్ది కొద్దిగా మాత్రమే; అంటే మన సమస్యలు తీరడం వల్ల వచ్చే శాంతిని మాత్రమే మనం కోరుకుంటున్నామన్నమాట. కానీ అది శాశ్వతంగా వుండడం లేదుగదా! కోరికల వెంబడి కోరికలు తెంపు లేకుండా వస్తూనే వుంటాయి. నిరంతరం మనం సమస్యల సుడిగుండంలో చిక్కుకుపోతూ వాటికోసం మహాత్ముల దగ్గరకు పరిగెత్తుతూనే వుంటున్నాం గదా! వాటిలో కొన్ని తీరవచ్చు, కొన్ని తీరకపోవచ్చు. మరి మనకు తృప్తి, శాంతి ఎంతవరకూ వచ్చినట్లు? దీనికి పరిష్కారం ఏమిటి?

ఈ ప్రశ్నలకు సమాధానమే పూజ్యశ్రీ మాస్టరుగారి జీవితం. ఆయన ఒక్కొక్క సమస్య కోసం భగవంతుని అడగడంగాక ఈ సమస్యలన్నింటికీ మూలమైన దానిని సాధించారు. శాశ్వత శాంతిని పొందారు. అందుకని మనం శాంతిని కోరుకుంటున్నప్పుడు అట్టి శాంతి కోసం తప్పక అట్టి ప్రయత్నం చేయవలసినదే! అటువంటి అనుగ్రహాన్ని పొందవలసినదేనని చెప్పక తప్పదు.

అయితే మనం అంతటి కఠినతరమైన సాధన చేయగలమా? మనకంతటి మనోబలం వున్నదా? మరి మనం సాయినాథుని అనుగ్రహాన్ని పొందడం అసాధ్యమా? అనే చింత మనకు కలగవచ్చు. అందుకే పూజ్యశ్రీ మాస్టరుగారు యిలా చెబుతుండేవారు. "ఒక్కొక్క విషయాన్ని గూర్చి నేనెంతో కష్టపడి తరచి తరచి ఆలోచించి, సంవత్సరాల తరబడి అన్వేషించి తెలుసుకున్న విషయాలను అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు, అతి సులభమైన మార్గాలను మీకు చెబుతున్నాను. ఎందుకంటే నాకానాడు ఎవ్వరూ చెప్పలేదు కనుక నేనే స్వయంగా తెలుసుకోవలసి వచ్చింది. ఇప్పుడు మీకు కష్టం లేదు. నేను చెప్పినవాటిని ఆచరిస్తూ పోతే చాలు. మీరు తప్పక సాయి యొక్క సంపూర్ణ అనుగ్రహాన్ని పొందగలరు".

అయితే పూజ్యశ్రీ మాస్టరుగారు ఏం చెప్పారు? ఆ సంగతి మనందరికీ తెలుసు! మహాత్ముల చరిత్రలు పారాయణ చేసుకోమని, సత్సంగాలు చేసుకోమనీ చెప్పారు. నిరంతరం సాయిని స్మరించమని, అందరిలో ఆయనే వున్నాడని చూడమని, అందరూ కలిసి మెలసి జీవించమనీ-యిలా యింకా ఎన్నో ఎన్నెన్నో!!!

వీటిలో కొన్నింటిని మనం చేస్తున్నాము, కొన్నింటిని చేయడానికి ప్రయత్నిస్తున్నాము. కానీ ఏది చేసినా ఎలా చేయాలో ఆయన చెప్పిన మూలసూత్రాన్ని పాటించకపోతే వ్యర్థమని ఆయన చెప్పిన మాటను గుర్తుంచుకోవాలి.

ఉదాహరణకు సత్సంగాలు చేయడము, సత్సంగాలకు వెళ్ళడము దాదాపు అందరమూ చేస్తూనే వున్నాము. సత్సంగాలు చేస్తున్నప్పుడుగానీ సత్సంగాలకు వెళ్తున్నప్పుడుగానీ మన ప్రవర్తన, మన ఆలోచనలు ఎలా వుంటున్నాయి? ఆయా విషయాలలో పూజ్యశ్రీ మాస్టరుగారు ఏయే జాగ్రత్తలు చెప్పారు? అనేది గమనించుకోవాలి.

'నేను మాస్టరుగారు చెప్పిన విధంగా సత్సంగాలు చేస్తున్నాను, ఇన్ని సత్సంగాలు చేసాను. నన్ను వాడు గౌరవించడా?' అని ఎప్పుడైనా అనిపించడము, అనడమూ జరిగిందనుకుందాం. దాని వెనకాలవున్న భావమేమిటో ఆలోచించుకోవాలి. అంటే మనం సత్సంగాలు చేస్తున్నామన్న అహంకారము, మనం గొప్పవాళ్ళమన్న గర్వము, మనలను యితరులు గౌరవించాలన్న కీర్తికాంక్ష వున్నాయని అర్థం. మనలను నలుగురూ గౌరవించడము, మనలను కార్లలో త్రిప్పడము, ఎక్కడెక్కడికో సత్సంగాలకు తీసుకెళ్ళడము, విదేశాలకు తీసుకువెళ్ళడము, మనకు అనుచరులు లక్షల కొద్దీ వుండడమూ యివేవీ మన ఉన్నతికి సరియైన కొలబద్దలు కావు. మనలోని బలహీనతలను గుర్తించి, వాటిని తొలగించుకోవడానికి ఎంతగా ప్రయత్నిస్తున్నాము అన్నదే పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన దానిని అమలు పరుస్తున్నామనడానికి నిదర్శనం. ఒక ప్రక్క ఆయన చెప్పినట్లు సత్సంగాలు మొదలైనవి చేసుకుంటూ, మరొకప్రక్క మనలోని బలహీనతలను తొలగించుకుంటూ పోతుండడమే పూజ్యశ్రీ మాస్టరుగారి అనుగ్రహానికి పాత్రులమవడానికి, అర్హత సంపాదించు కోవడానికి మార్గము.

అందుకని ఈ ఫిబ్రవరి తొమ్మిదిని (9.2.2010) పురస్కరించుకుని మనలను మనం సరిదిద్దుకునే ప్రయత్నం చేద్దాం.

జై సాయి మాస్టర్ !!!

వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

శ్రీమతి అడిదం వేదవతి

శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.

ఎనిమిదవ ప్రసంగము

ఒకప్పుడు శ్రీ ప్రకాశానంద స్వామివారు జామ్ నగర్ నుండి పీఠడియా వెళుతున్నారు. ఇది చూసి త్ర్యంబక భాయి ఇలా అన్నారు: "నిత్యానందస్వామివారి దర్శనము చేయాలనే కోరిక వున్నది. అనుజ్ఞ ఇస్తే మీతో నేను కూడా వస్తాను."

స్వా॥ప్ర॥ : ఎంతో సంతోషము. రండి.

ఇద్దరూ పీఠడియా వెళ్ళారు. నిత్యానందస్వామి "ఈయన ఎవరు?" అని అడిగారు.

శాస్త్ర శ్రవణము ఔషధము

స్వా॥ప్ర॥ : వీరు జామ్ నగర్ లో డా॥ వీరజోభాయి కుమారుడు. బొంబాయిలో బి.ఏ. చదువుతూ వుండగా క్షయవ్యాధి సోకింది. వ్యాధి ముదిరిపోవడం చూసి వైద్యులు తగు జాగ్రత్త తీసుకోమని ఈయనకు సలహా ఇచ్చారు. అప్పుడు ఈయన లక్ష్యము స్థూలశరీరము నుండి సూక్ష్మశరీరము వైపు మళ్ళింది. అప్పుడు తమ తండ్రిని ఇలా అర్థించాడు: "ఉదయము, సాయంకాలము వేదాంత శ్రవణం చేస్తే బాగుంటుంది." తండ్రిగారు శాస్త్రజ్ఞులను రప్పించి ప్రతిరోజూ ఉదయము, సాయంత్రము వీరికి వేదాంత శ్రవణాన్ని ఏర్పాటు చేశారు. భగవద్గీత, ఉపనిషత్తులు, పంచదశి మొదలైన గ్రంథాలను ఈయన సావధానంగా విన్నారు. విద్యాభ్యాసకాలంలో ఆంగ్లముతో పాటు సంస్కృతము కూడా చదివి వుండడం వలన వీరికి శాస్త్రాభ్యాసము కష్టమనిపించలేదు.

త్ర్యంబక భాయితో ఇద్దరు నౌకరులు కూడా ఉండేవారు. బలహీనంగా వుండడం వలన ఆయన శరీరము తరచూ నొప్పులు పెడుతూవుండడం వలన, ఒళ్ళు పట్టడానికి వారిద్దరూ అవసరమయ్యేవారు.

శ్రీ నిత్యానందస్వామివారి వాత్సల్యానికి అంతులేదు

ఆ సమయంలో ప్రకాశానందస్వామి మొదలైనవారు నిత్యానంద స్వామివారి దగ్గర కూర్చుని వున్నారు. భోజన సమయం అయినందువలన భోజనానికి పిలుపు వచ్చింది. త్ర్యంబక భాయి ఆరోగ్యము సరిగ్గా లేనందువలన, నిత్యానందస్వామివారు సాయంకాలం భోజనము చేయనందువలన వారిద్దరూ భోజనానికి వెళ్ళలేదు. త్ర్యంబక భాయి దగ్గర నౌకరులు ఎవరూ హాజరుగా లేరు. అప్పుడు నిత్యానందస్వాములవారే ఆయన కాళ్ళు పట్టసాగారు. ఇదిచూసి త్ర్యంబక భాయి ఇలా అన్నాడు – "బాబూ, ఇది ఏమిటి? నాకెంత సిగ్గుచేటు? నాకు నరకము వస్తుంది."

స్వా॥ని॥ : ఏమీ తప్పులేదు. నా పిల్లవాడివే కదా?

అందరూ భోజనము చేసి వచ్చిన తరువాత ప్రకాశానంద స్వామివారితో త్ర్యంబక భాయి ఇలా అన్నాడు: "చూశారా! స్వామివారు నా కాళ్ళు పడుతున్నారు. నాకెంతో బాధగా వున్నది."

బుద్ధుని సమానులైన స్వామివారు

స్వా॥ప్ర॥ : నీవు వారి పిల్లవాడివి. అంతే కాదు, స్వామివారు బుద్ధదేవుని వంటివారు. బుద్ధదేవుడు మహాభినిష్క్రమణ తరువాత దారిలో కనిపించిన దుఃఖితులందరికీ సేవ చేసేవాడు. పశుపక్ష్యాదులకు కూడా ఏమాత్రం బాధ కలిగినా ఆయన సహించలేకపోయేవాడు. వాటి దుఃఖాన్ని, కష్టాన్ని పోగొట్టేవాడు .

శ్రుతి వైవిధ్యము

రాత్రి తొమ్మిది గంటలకు భోజనం తరువాత అందరూ కూర్చుని వున్నారు. త్ర్యంబక భాయి నిత్యానంద స్వామివారిని ప్రశ్నించారు –

"ఉపనిషత్తులలో కొన్ని శ్రుతులు ద్వైతాన్ని బోధిస్తాయి. ఉదా:- "ద్వా సుపర్ణా సయుజా సఖాయా", "జీవుడు, ఈశ్వరుడు అనే రెండు పక్షులు స్నేహితులు, కలిసి వుంటారు. "యదాపశ్యత్యన్యమీశమ్", "ఏకాగ్ర చిత్తముతో యోగులకు అందనివాడు, దేహపరిమితుడు కానివాడు, ప్రపంచాతీతుడు అయిన దేవుని చూసినపుడు శోకాలన్నీ నశిస్తాయి."

కాని, మరికొన్ని అద్వైతాన్ని బోధిస్తాయి. ఉదా॥ "అహం బ్రహ్మాస్మి!", "నేను బ్రహ్మను"; "ఆత్మానం చేద్విజానీయాత్!", "ఆత్మ అనే నేను చైతన్య అపరోక్ష బ్రహ్మాన్ని అని తెలుసుకోవాలి" మొ॥వి. వీటిలో ఏవి నిజమని అంగీకరించాలి?

శ్రీ నిత్యానంద స్వామివారు ప్రకాశానంద స్వామి వారిని సమాధానం చెప్పమని కోరారు.

స్వా॥ప్ర॥ : ఈ సందేహానికి విద్వాంసులే సమాధానము చెప్పగలరు. నేను విద్వాంసుడిని కాను. కాబట్టి సరైన సమాధానం చెప్పలేను. కాని తెలిసినంతవరకు చెప్తాను. ద్వైతబోధకాలు (ద్వైతాన్ని బోధించేవి), అద్వైత బోధకాలు (అద్వైతాన్ని బోధించేవి) అయిన శ్రుతులు (వేదాలు) అధికారి భేదమును బట్టి (వారి వారి యోగ్యతను అనుసరించి) చెప్పబడ్డాయి. భేదజ్ఞానము (ఏది భేదమో (వేరో) అనే జ్ఞానము), అభేదజ్ఞానము (ఏది ఏకమో అనే జ్ఞానము) కూడా అలానే అధికారి భేదము చేత వేరువేరుగా చెప్పబడ్డాయి. తమ తమ యోగ్యతలను బట్టి ముముక్షువులు వాటిని గ్రహించాలి.

మనువు ఇలా చెప్పాడు:

శ్లో॥ శ్రుతిద్వైధం తు యత్ర స్యాత్
తత్ర ధర్మావుభౌస్మృతా ।
ఉభావపి హితౌ ధర్మౌ
సమ్యగుక్తౌ మనీషిభిః ॥

భావము: శ్రుతులు రెండు రకాలుగా చెప్పినచోట రెండూ ధర్మాలే అని స్మృతి చెబుతున్నది. వివేకము వున్న మానవులు రెండింటిని విచారించి రెండూ హితకరములైన ధర్మాలే అని తెలియజేశారు.

కాబట్టి వాటిలో నీకు తగిన దానిని నీవు గ్రహించు. దానిని గురించి ఎక్కువ అనుమానించవలసిన అవసరము లేదు.

కపిలుడు సాంఖ్యశాస్త్రములో ఇలా అన్నాడు –

"శ్రుతి విరోధాన్న కుతర్కాపసదః స్వాత్మలాభః"

భావం: " శ్రుతి విరోధాన్ని (శ్రుతిలో ఉన్న భేదాన్ని) ఆధారంగా చేసికొని కుతర్కము చేసినట్లైతే ఆత్మలాభం కలుగదు.

ఇదే విధంగా శ్రుతివైవిధ్యము (శ్రుతిలోని వైవిధ్యాన్ని) వున్నచోట తర్కానికి అవకాశం ఇవ్వకుండా తన యోగ్యతను అనుసరించి సగుణబ్రహ్మోపాసనో, లేక నిర్గుణబ్రహ్మోపాసనో, భేదోపాసనో లేక అభేదోపాసనో - ఏదో ఒక దానిలో నిమగ్నుడవ్వాలి. అదే చేయవలసినది.

త్ర్యంబక:- స్వరూప సాక్షాత్కారానికి సాధనమేమిటి?

నిత్యానంద స్వామివారు ప్రకాశానందులవారిని సమాధానం చెప్పమని కోరారు.

స్వా॥ప్ర॥ : ప్రస్తుతము అసుర, రాక్షస సంపదలే ఎక్కువగా పాలిస్తున్నాయి. పురుషార్థానికి చోటులేదు. పురుషార్థము లేనిదే స్వరూప సాక్షాత్కారము జరుగదు. స్వరూపనిష్ఠకు దైవీసంపద అవసరము. అది నశించి పోయింది.

స్వా॥ని॥ : భగవద్గీత మొ॥న శాస్త్రాలలో వున్నది కదా?!

స్వా॥ప్ర॥ : భగవద్గీత మొ॥న శాస్త్రాలో వున్నది. కాని ఇవాళ అది చావుకు సిద్ధంగా వున్నది. బ్రతికి వున్నట్లు కన్పించడమే లేదు. భగవద్గీత మొ॥వి చాలామంది చేత చాలా ప్రదేశాలలో అధ్యయనం చేయబడుతున్నాయి. ఉపదేశింపబడుతున్నాయి. కానీ దానిలోని బోధను ఆచరించేవారు మాత్రం కనిపించడం లేదు.

ఒక నగరంలో రణఛోడ్-జీ మందిరము వున్నది. (ద్వారకానాథుడైన శ్రీకృష్ణుడు జరాసంధునితో యుద్ధంలో ఓడిపోయి పారిపోవడం వలన గుజరాత్ వాసులు. ఆయనను రణఛోడ్-జీ అంటారు). దాని మహంతు ఒక వైష్ణవ సాధువు, అతడు చాలా ధనం సంపాదించాడు. ఇతర గ్రామాలలో అతనికి భవనాలు, మందిరాలు వున్నాయి. తాను మఠాధిపతిని అనుకునేవాడు. తన మఠానికి 'గీతాపీఠము' అని పేరు పెట్టాడు. పన్నెండు నెలలు గీతా ప్రవచనం చేసేవాడు. ప్రవచన సమయంలో ఆనందభాష్పాలు కార్చేవాడు. ఒక జిజ్ఞాసువు ఒకరోజు హరికథ వినడానికి వచ్చాడు. ప్రవచన సమయంలో ఆయన ఇలా చెప్పాడు- "భగవానుడు తన శ్రీముఖమునుంచి వెలువరించిన వాక్యాలనే నేను నమ్ముతాను. ఆచార్యులు, విద్వాంసులు రాసిన టీకలను, భాష్యాలను నేను నమ్మను. అవి నాకు ప్రమాణాలు కావు. అంతేకాదు, ఉపనిషత్తులు గానీ, శ్రుతులు గానీ నాకు ప్రమాణాలు కావు. కారణమేమిటంటే అవి అన్నీ భగవంతుడు ఋషుల ద్వారా చెప్పించినవి. కాని భగవద్గీత భగవంతుడి ముఖపద్మము నుండి సృష్టించబడింది. మహాభారతంలో ఇలా ఉన్నది--

శ్లో॥ గీతా సుగీతా కర్తవ్యా
కిమన్యైః శాస్త్ర విస్తరైః l
యా స్వయం పద్మనాభస్య
ముఖపద్మాద్వినిస్సృతా ll

భావము: గీతాధ్యయనం చేయాలి. ఇతర శాస్త్రాలను చదవడం అవసరము. ఎందుకంటే గీత మాత్రమే భగవానుడి ముఖపద్మము నుంచి వెలువడింది.

ప్రవచనము తరువాత ఆ జిజ్ఞాసువు సాధువుగారిని అడిగాడు: తమరు 'భగవానుడు చెప్పిన మాటలను నమ్ముతాం' అని సెలవిచ్చారు. భగవద్గీత ఆరవ అధ్యాయము 10వ శ్లోకములో అపరిగ్రహము చెప్పారు. "అపరిగ్రహః" "పరిగ్రహం పనికిరాదు". అట్టి పదార్థాలను అనుభవించకూడదని అన్నారు. భగవంతుడి ఆజ్ఞను మీరు పాటిస్తారు కదా. అలా పాటించినట్లైతే మీ దగ్గర బండ్లు, వాహనాలు, భూములు, ధనము, వస్తువులు ఎందుకు ఉంచుకున్నారు? 12వ అధ్యాయం, 8వ శ్లోకంలో 'అనికేతః' అని ఉన్నది కదా! తమకు పెద్ద పెద్ద మేడలు వున్నాయే! 6వ అధ్యాయం 2వ శ్లోకంలో 'సమలోష్టాశ్మ కాంచనః' అని వున్నది. బంగారము, రాయి, మన్ను సమానంగా చూడాలి. తమరు, బంగారం ఎంతో నిలువచేసివున్నారు. ఇవి అన్నీ భగవానుని ఆజ్ఞకు వ్యతిరేకాలు. మీరు కూడా నావంటివారే అనుకోవచ్చా?

మాతృదేవి స్మృతులు

శ్రీ ఎస్ వి రాంప్రసాద్

నాగోల్ సత్సంగ సభ్యులు, రాంప్రసాద్ గారు, పూజ్యశ్రీ అలివేలుమంగమ్మ తల్లి లీలావైభవాన్ని ఈవిధంగా తెలియచేస్తున్నారు:

నేను రాజమండ్రిలో వుండగా, 1982 సం॥లో అక్కడ మెడిటేషన్ సెంటరులో టీచర్ గా పనిచేస్తున్న శ్రీ టి.డి.కృష్ణమూర్తిగారి ద్వారా పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి గురించి తెలిసింది. ఆయన శ్రీ మాస్టరుగారి గురించి ఎన్నో విషయాలు ఉత్సాహంగా చెబుతూ వుండేవారు. శ్రీ మాస్టరుగారిని చూడాలని బాగా అనిపించేది. 1984సం॥లో నాకు అవకాశం లభించింది. బిట్రగుంటలో మాబంధువులఇంటికివెళ్ళి, అటునుంచి ఒంగోలు వెళ్లి పూజ్యశ్రీ మాస్టరుగారి దర్శనం చేసుకున్నాను. అప్పుడు వారు నాకు 'శ్రీ సాయి లీలామృతము' గ్రంథాన్ని ప్రసాదించారు. తరువాత 1986 సం॥లో పూజ్యశ్రీ మాస్టరుగారు, రాజమండ్రిలో పేపరుమిల్లు దగ్గరలో ఉన్న బాబాగుడిలో సత్సంగం చేయటానికి వచ్చినప్పుడు, నా ఆహ్వానాన్ని దయతో మన్నించి, మా ఇంటికి వచ్చారు. అది నాకు బాబా ప్రసాదించిన వరం!

'రాజమండ్రి పేపరుమిల్స్' లో స్టెనోగ్రాఫరుగా పనిచేస్తున్న నాకు సం॥1989 జూలైలో హైదరాబాదుకు బదిలీ (transfer) అయ్యి, సకుటుంబంగా ఇక్కడికి చేరుకొని, సైనిక్-పురిలో నివాసముంటున్నాను. 2002సం॥లో కొందరు సత్సంగ సభ్యుల ద్వారా పూజ్యశ్రీ అమ్మగారు మల్కాజిగిరిలో వున్నారని తెలిసి, ఎంతో సంతోషించి, నేను, నా శ్రీమతి వారి దర్శనానికి వెళ్ళాము. అది మొదలు, చాలా తరచుగా, అంటే వారానికి 3,4 సార్లు, మేమిద్దరం దర్శనానికి వెళ్తుండేవాళ్ళం. అక్కడ గ్రంథ పఠన, సత్సంగం జరిగేవి. మేమేదైనా అడిగితే దానికి అమ్మగారు వివరణ యిచ్చేవారు. అక్కడ వాతావరణం చాలా హాయిగా, ప్రశాంతంగా వుండేది.

ఇలా జరుగుతూ వుండగా, ఒకసారి నాకు పెద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఆపద్బాంధవి అయిన అమ్మగారు, దాన్నించి నన్నెలా కాపాడారో, మీతో పంచుకుంటాను. ప్రతిరోజూ సత్సంగం పూర్తైన వెంటనే ఒకొక్కళ్ళు పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కారం చేసుకునే వాళ్ళం. అమ్మగారు ప్రసాదం యిచ్చేవారు. 2007 జనవరి నెలలో ఒకరోజు నేను, మా ఆవిడా నమస్కారం చేసుకుని పైకిలేవగానే, అమ్మగారు ప్రసాదం చేతిలో పట్టుకుని, కొంచెం సేపు ఎటో చూస్తున్నట్లుగా వుండిపోయి, అప్పుడు ప్రసాదం యిచ్చారు. అలా వరుసగా రెండు రోజులు జరిగింది. మేము, అమ్మగారు ఎందుకు అలా వుండిపోయారోనని అనుకున్నాము.. మర్నాడు, జనవరి 26న, ఆఫీసుకి సెలవు కావడం వల్ల, మేమిద్దరం ఉదయం 11 గంటల ప్రాంతంలో ఏదో పనిమీద బైటికి వెళ్లి, తిరిగి వస్తున్నాము. వెస్ట్ మారేడుపల్లి నుంచి సైనికపురి వస్తుంటే, దారిలో నా ముందు ఒక మిలిటరీ వాన్ వెడుతోంది, ముందు ఒక చిన్న రోడ్ వుంది, వ్యాను అటు తిప్పుతాడని అవగాహన లేక, నేను నా స్కూటరు మీద ముందుకు వెళ్ళిపోయాను, అదే టైములో వ్యాన్(van) మలుపు తిప్పాడు. నా బండి, వ్యానుకి తగిలి మేమిద్దరం కిందపడిపోయాము. ఈలోగా మిలటరీ వాళ్ళు వాన్ ఆపుకుని మాదగ్గరికి

వచ్చారు. మాఆవిడకి ఏమీ కాలేదు కానీ, నాకు మాత్రం కుడి మోకాలు కింది భాగం విరిగిపోయింది. అంటే బాగా నలిగిపోయినట్లయ్యి, పట్టులేక వ్రేలాడుతోంది. పైగా నా మీద బండి పడిపోవడం వల్ల, నేను పెట్టుకున్న హెల్మెట్ బండిలో యిరుక్కుపోయి, నాతల బైటికి తీయడం కష్టమైపోయింది. అప్పుడు మిలిటరీ వాళ్ళు గబాగబా నన్ను బయటకు తీసి, మిలటరీ హాస్పిటల్ కి తీసుకువెళ్లారు. అక్కడ 'బైటవాళ్లకి చికిత్స చెయ్యము' అని చెప్పి, ఫస్ట్ ఎయిడ్ చేసి, వాళ్ళ వాన్ లోనే మా ఇంటిదగ్గర దింపారు. తరవాత ఈ విషయాన్ని పూజ్యశ్రీ అమ్మగారికి తెలియచేసాము. మర్నాడు, తెలిసిన వాళ్ళని కనుక్కుని ECIL దగ్గర ఒక హాస్పిటల్ లో జాయిన్ అయ్యాను. ఆ మరుసటి రోజు 8 గంటలకు ఆపరేషన్ అని చెప్పారు. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, "హాస్పిటల్ సరిగ్గా చూసుకున్నారా" అని ఫోన్ చేయించారు. "హాస్పిటల్ బాగానే వుంది, మంచి అనుభవజ్ఞుడైన డాక్టరు" అని సమాధానం చెప్పాను. కానీ, పూజ్యశ్రీ అమ్మగారి హెచ్చరిక నేను గ్రహించలేక పోయాను. మళ్ళీ అమ్మగారు, "ఆపరేషన్ మొదలుపెట్టిన దగ్గరనించి, పూర్తయ్యేవరకు, మా ఆవిడని పారాయణ చేసుకుంటూ వుండమని" ఫోన్ చేయించారు. తరువాత తెలిసిన విషయం ఏమిటంటే, కాలు కట్ చేసి లోపల రాడ్ వేశారని, కొత్త టెక్నాలజీ ఉపయోగిస్తే, రాడ్ వెయ్యకుండానే ఆపరేషన్ చెయ్యవచ్చని!! అందరికి రెండు మూడు నెలల్లో తగ్గేది నాకు తగ్గడానికి ఆరు నెలలు పట్టింది. వెనక్కి తిరిగి ఆలోచిస్తే, ఆరోజు పూజ్యశ్రీ అమ్మగారు ప్రసాదం యిస్తూ మావైపు చూసిన చూపు తలచుకుంటే, రాబోయే పరిస్థితి ముందే గ్రహించి, నన్ను చాలా పెద్ద ప్రమాదంనుంచి కాపాడారని అనిపిస్తుంది. హాస్పిటల్ విషయంలో చేసిన హెచ్చరిక ఆలోచిస్తే, పూజ్యశ్రీ అమ్మగారి సర్వాంతర్యామిత్వం మనకు బాగా అవగతమవుతుంది.

మళ్ళీ కోలుకున్న దగ్గరనుంచి మేమిద్దరం పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వెళ్లడం మొదలుపెట్టాం. మా పిల్లలు కూడా తరచుగ వచ్చేవారు.. మా అమ్మాయి మాధురి చదువు పూర్తయ్యి, జాబ్ లో జాయిన్ అయింది. మా అబ్బాయి ఉపేంద్రకి ఇంజనీరింగ్ పూర్తయ్యింది. కొన్నాళ్ళకి, అంటే 2008 లో, పూజ్యశ్రీ అమ్మగారు మల్కాజిగిరి నుంచి నాగోల్ తరలి వెళ్లారు. అప్పుడు చాలా బాధవేసింది. ఇప్పటిలాగ అక్కడకి వెళ్లగలమా అని! సైనిక్-పురి నుంచి మల్కాజిగిరికే దూరం అనుకుంటే, నాగోల్ యింకా దూరం. కానీ, రోజులు గడుస్తున్నకొద్దీ, పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధి కోల్పోవడం చాలా బాధగా అనిపించేది. ఒకరోజు నాగోల్ అమ్మగారి దర్శనానికి నేనొక్కడినే వెళ్లాను. పూజ్యశ్రీ అమ్మగారు సత్సంగహాల్లో కూర్చుని వున్నారు. నేను అమ్మగారి పాదాల దగ్గరగా కూర్చున్నాను. పూజ్యశ్రీ అమ్మగారు పలకరింపుగా చిన్నగా నవ్వారు. నాకు యిక లోపలినించి దుఃఖం తన్నుకు వచ్చింది. కళ్ళవెంట నీళ్లు బొటబొటా కారిపోతున్నాయి. ఆపుకోవడం నావల్ల కాలేదు. అలా కొంతసేపు గడిచాక, "అమ్మగారూ! మీరు అవకాశం ఇస్తే మేము కూడా యిక్కడికి వచ్చేస్తాము" అన్నాను. అప్పుడు పూజ్యశ్రీ అమ్మగారు, "మరి మీకు, మీ అమ్మాయికి ఆఫీసుకి దూరం అవుతుందేమో ఆలోచించుకోండి" అన్నారు. "ఫరవాలేదమ్మా, రెండు కిలోమీటర్లు తేడా ఉంటుంది, వేరే రూటులో వెళ్లొచ్చు" అన్నాను. "అలాగయితే సరే" అన్నారు. ఈ విషయం మీద ఇంట్లో కూడ అందరం చర్చించుకున్నాము. పిల్లలు కూడా సుముఖంగా వుండటం వల్ల, మా కుటుంబం 2009లో నాగోలుకి చేరుకున్నాము.

ఆ తరువాత కొంత కాలానికి.......
మా ఆఫీస్ లో నాకు కొన్ని చికాకులు తలెత్తాయి. కొన్ని చిత్రమైన పరిస్థితుల వల్ల నేను మానసికంగా చాలా బాధ పడేవాడిని. అందుకే తరచుగా, ఆఫీసు కెళ్ళేటప్పుడు మా ఆవిడతో, "ఏరోజు ఎలా వుంటుందో చెప్పలేను, ఏ రోజైనా నేను రిజైన్ చేసి వచ్చేయవచ్చుకూడా!" అని చెబుతుండేవాడిని. ఒకసారి, నేను సాయంత్రం ఆఫీస్ నించి వచ్చి నిలయానికి వెళ్లాను. అప్పటికి పూజ్యశ్రీ అమ్మగారు హాల్లోకి వచ్చి సత్సంగం చేస్తున్నారు. నేను లోపలకి వెళ్లి కూర్చున్నాను. ఎప్పుడూ సత్సంగంలో ఉత్సాహంగా పాల్గొంటూ, ప్రశ్నలు వేస్తూ, సమాధానాలు తెలుసుకుంటూండే నేను, ఆరోజు ఆఫీసులో చికాకుల వల్ల, మనసు బాగోక మాట్లాడకుండా వుండిపోయాను. కానీ సర్వజ్ఞమూర్తి అయిన అమ్మగారు నా మానసిక పరిస్థితికి తగిన విధంగా ప్రశ్నలు వేస్తూ, నన్ను కూడా ఆ గోష్టిలో పాలుపంచుకునేలాగా చేసి,

నా మనసులో ఎన్నో విషయాలను సమాధాన పరిచారు. ఎప్పటిలాగే సత్సంగం పూర్తయ్యాక పూజ్యశ్రీ అమ్మగారి దగ్గరకెళ్ళి నమస్కారం చేసుకుని ప్రసాదం కోసం చేయి చాపగానే, అమ్మగారు ప్రసాదం యిస్తూ,,,"మన టైం బాగాలేనప్పుడు, ఫైల్ తెమ్మంటే తేవాలండి" అన్నారు. నేను ఆశ్చర్యపోయి అలా చూస్తూ వుండిపోయాను. ఆ రోజు ఆఫీసులో అదే జరిగింది! ఆరోజు సత్సంగంలో దొర్లిన విషయాల వల్ల, అమ్మగారు చెప్పిన ఆ మాట వల్ల మనసు శాంతపడి, స్థిరపడి, నేను పదవీ విరమణ వయస్సు (60 సం॥లు) వచ్చేవరకు ఉద్యోగం చేయగలిగాను. అంతేకాక, నాకు రిటైర్మెంట్ అయ్యేలోపు ప్రమోషన్ రావలసివున్నా, ఏ మాత్రం రావడానికి అవకాశంలేని పరిస్థితిలు ఆఫీసులో నెలకొనివున్నాయి. నేను ఆ విషయం పూజ్యశ్రీ అమ్మగారి చెప్పుకున్నాను. కేవలం వారి దయతోనే రాదనుకుని ఆశలు వదిలేసుకున్న ప్రమోషన్ వచ్చింది. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా అనుభవాలు, అనుభూతులు,!!

ప్రాణదాత్రే నమః అన్న నామం సూచించినట్లు, పూజ్యశ్రీ అమ్మగారు మమ్మల్ని ప్రాణాంతకమైన అనారోగ్యాలనించి బైటపడేశారు. సం॥ 2014 లో మా ఆవిడకి గైనిక్ ప్రాబ్లమ్ వచ్చింది. ఆ సమస్యతో చాలాకాలం బాధ పడింది, మంచంమీద నుంచి లేవలేని పరిస్థితి. ఆ సమయంలో పూజ్యశ్రీ అమ్మగారు నిలయానికి రమ్మని కబురు చేశారు. అతికష్టం మీద నిలయానికి తీసుకుని వెళ్ళాము. ఆరోజు దీపావళి పండగ సందర్భంగా సత్సంగసభ్యుల బాణసంచా వెలిగించే కార్యక్రమం చూడటానికి పూజ్యశ్రీ అమ్మగారు బైటకి వస్తూ, ఒక పక్కగా నిల్చుని నమస్కారం చేసుకుంటున్న నా శ్రీమతి చేయి పట్టుకున్నారు. ఊహించని ఈ సంఘటనకి తనకి ఒళ్ళు జలదరించిందట. అమ్మగారు తనచేతిని పట్టుకుని తోడుగావున్నారు అనిపించిందట. ఆ తరువాత పూజ్యశ్రీ అమ్మగారి దయవల్ల తనకి మానసికంగా చాలా ధైర్యం వచ్చింది. అయితే ఆ ట్రీట్మెంట్ కోసం డాక్టర్స్ ఇచ్చిన ఒక ఇంజక్షన్ వల్ల, హార్ట్ కి ప్రాబ్లెమ్ వచ్చే పరిస్థితి ఎదురయ్యింది. అందరం చాలా కంగారు పడ్డాము. ఈపరిస్థితుల్లో ఒకరోజు తనకి కలలో బాబా, మాస్టరుగారు, అమ్మగారు కనిపించి, "తగ్గుతుంది" అని ముగ్గురూ మూడుసార్లు చెప్పారట. అలాగే కొన్నాళ్ళకి చాలా వరకు సర్దుకుంది. కానీ పూర్తిగా స్వస్థత చేకూరాలంటే, ఒక ఆపరేషన్ చేయాలన్నారు. అది తప్పుతుందేమోనని చాలా ప్రయత్నం చేసాము, కానీ తప్పదన్నారు అదే విషయం పూజ్యశ్రీ అమ్మగారితో చెప్పుకుని, ఆపరేషనుకి వెళ్ళాము. ఆపరేషన్ చేసేముందు, మళ్ళీ ఒకసారి టెస్ట్ చేసి, ప్రస్తుతానికి ఆపరేషన్ అవసరం లేదని పంపించేశారు! ఆ తల్లి దయవల్ల ఇప్పటిదాకా ఆ అవసరం రాలేదు.

నాకు 2019 సం॥ చివరలో, చిన్నపాటి జ్వరంతో మొదలైన నా ఆరోగ్యసమస్య డాక్టర్స్ రోగనిర్ధారణ సరిగ్గా చేయలేకపోవడం వల్ల, వారు ఇచ్చిన ఇంజక్షన్ రియాక్షన్ అవడంవల్ల, నా కిడ్నీస్ పై, లంగ్స్ పై తీవ్ర ప్రభావం చూపించింది. అప్పుడు సోమాజిగూడలో వున్న యశోదాహాస్పిటల్స్ లో నన్ను అడ్మిట్ చేశారు. అక్కడ డాక్టర్స్ 48 hours observation అని చెప్పారు. ఆ పరిస్థితి నించి కోలుకుంటానని ఎవ్వరూ అనుకోలేదు. హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయిన వారంరోజులకు రివ్యూకి వెళ్ళినప్పుడు తిరిగి ప్రమాదకరమైన పరిస్థితులు నెలకొని, మరలా అడ్మిట్ చేశారు. అప్పుడు నాకు ఆపరేషన్ చేసి శరీరం నుండి నీరు బయటికి తీశారు. రెండవసారి హాస్పిటల్లో అడ్మిట్ అయ్యేసరికి నాకు విపరీతమైన భయం కలిగి అమ్మగారిని ఎంతో ఆర్తితో ప్రార్థించుకున్నాను. ఆ తల్లి యిచ్చిన ధైర్యం వల్ల ఆ భయంపోయి, ఆపరేషన్ చేయించుకున్నాను. ఈ విధంగా యింతటి విపత్కరమైన పరిస్థితులలో నుండి ఆ తల్లి దయతో బయటపడ్డాను. నాకూ, మా ఆవిడకి పూజ్యశ్రీ అమ్మగారు పునర్జన్మని ప్రసాదించారు.

ఇప్పుడు అనిపిస్తుంది, ఇంత చేసిన పూజ్యశ్రీ అమ్మగారికి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను? ఎప్పటికి, శరణాగతితో, కృతజ్ఞతతో వుండే సద్బుద్ధిని ప్రసాదించమని ప్రార్థించడం తప్ప!

జన్మజన్మలకు వారి తోడూనీడలలోనే జీవించాలని, వారికి నచ్చేవిధంగా మా జీవితాలు గడపాలని కోరుకుంటూ..... వారి పవిత్ర పాదపద్మములకు శిరస్సువంచి అంజలి ఘటిస్తున్నాను .

జై సాయి మాస్టర్!!

ప్రేమ స్వరూపుడు

శ్రీ కె. ఎస్.ప్రసాద్

(అతి చిన్న వయస్సులో మాస్టరుగారి దరిచేరి వారి ప్రేమను పొంది, వారి జీవితంలోని ప్రతి అంశాన్ని కుతూహలంతో క్షుణ్ణంగా పరిశీలించి వారి ఆచరణా పాటవానికి ప్రభావితుడై ఆధ్యాత్మిక బాటలో బాటసారియై తన లక్ష్యము వైపు పురోగమిస్తున్న వీరు ఉత్సాహంగా, విపులంగా మాస్టరుగారి జీవిత ఘట్టాలను మనకందిస్తూ సాయిమాస్టరు సన్నిధికి తీసుకెళ్తున్నారు.)

1970లో హిల్ వ్యూ రెస్టారెంట్లో బెంచీపైన కాఫీ గ్లాస్ పెట్టుకుని దూరాన గల కొండ వంక చూస్తూ వున్నట్టి మాస్టరుగారిని నేను ప్రథమంగా చూశాను. అప్పటికి నా వయస్సు 11 సం॥లు. అప్పుడు నేను గులాబ్ జామ్ తింటూ మాటిమాటికీ వారినే చూస్తున్నాను. ఎవ్వరూ ప్రక్కన లేకుండా కాఫీ త్రాగుతూ, దీర్ఘంగా ఆలోచిస్తూ ఆ కొండ వంక చూస్తున్న ఆయనను అలా చాలాసేపు గమనించాను. తరువాత కొన్ని రోజులకు మా నాన్నగారితో కలసి మాస్టరుగారి దగ్గరకు ఒకసారి వెళ్ళాను. అప్పుడు మాస్టరుగారి దృష్టి చాలా తీక్షణంగా వుంది, నా వైపు వారు చూడగానే నేను వెంటనే తప్పుచేసిన వాడిలా తల దించుకొనేటట్లు చేసింది వారి చూపు! ప్రతి గురువారం రాత్రి ఉపవాసం వుండేవారు. మా ఇంటినుంచి మా నాన్నగారు వారికి గురువారం నాడు సాయంత్రం పాలు, ఇంట్లో పూచిన పూలు తీసుకొని వెళ్ళేవారు.

ఒకసారి మా నాన్నగారు “ఈరోజు మాస్టరుగారికి పాలు నీవు తీసుకొని పోయి ఇవ్వు” అన్నారు. నాకు పూర్లు తిరగటం అంటే మహా సరదా! కనుక వెంటనే ‘అలాగే’ అని సాయంత్రం పాలు తీసుకొని బయలుదేరాను. మొదట్లో చాలా సంబరంగా వున్నది గాని, విద్యానగర్ దగ్గరయిన కొద్దీ మనసులో భయం మొదలైంది. వారు కాలేజీ లెక్చరర్, నేనేమో హైస్కూల్ విద్యార్థిని. అప్పట్లో టీచర్స్ అంటే చచ్చేంత భయం, ఎలాగో గుండె దిటవు చేసుకొని మాస్టరుగారి రూము దగ్గర చేరుకొని లోపలకు చూద్దునుగదా, లోపల ధ్యానంలో వున్న ఒకరు నిటారుగా, ఇంకొందరు గూని వున్నట్లు వంగిపోయి, ఒకరు తల క్రిందికి వాల్చేసి, ఒకరు పద్మాసనంలో, ఇంకొందరు అర్ధ పద్మాసనంలో,

ఒకరు కళ్ళు గట్టిగా మూసుకొని, ఒకరు కళ్ళు సగం మూసినట్లు--రకరకాల భంగిమల్లో వున్న సత్సంగసభ్యుల్ని గమనిస్తూ నా దృష్టి మాస్టరుగారి వైపుకు మళ్ళించాను. వారి ముఖంలో ప్రశాంతత, ధ్యాన తీవ్రత చూచి నేను అలా బయటే నిల్చొండిపోయాను చాలా సేపు. మాస్టరుగారు నెమ్మదిగా కళ్ళు తెరచి నన్ను చూశారు. బయటనుంచే నమస్కరిస్తూ, "నేను మెట్టు నుంచి వస్తున్నానని, మా నాన్నగారు పంపారనీ" వణికే స్వరంతో ఆమరచెంబు చూపాను బయటనుంచే. అప్పుడు ఒక సభ్యుడు వచ్చి మరచెంబు తీసుకొని మాస్టరుగారికిచ్చాడు. "చెంబు ఇప్పుడు ఇవ్వమంటావా? రేపు తీసుకెళ్తావా?" అన్నారు. నాలో భయాన్ని అణుచుకుంటూనే రేపొచ్చి తీసుకొంటానని చెప్పాను. "అలాగే" అన్నారు. అంతే, గిర్రున వెనక్కు తిరిగి పరుగో పరుగు. కోట సినిమా హాలు దగ్గర ఆగాను. ఆ రోజు రాత్రి సినిమా చూచుకొని కోటలో నిద్రపోయి, ఉదయాన్నే 7 గం॥లకు మాస్టరుగారి గది బయట నిల్చొని వుంటే కొద్ది సేపటికి మాస్టరుగారొచ్చారు. మాట్లాడకుండానే నాకు మరచెంబు ఇస్తే "పోయొస్తా సార్" అని మెట్టుకు వచ్చేశాను. మరలా గురువారం నాడు మాస్టరుగారి దగ్గరకెళ్ళాలని మనస్సులో వుంది, కాని వారి దగ్గర తెలియకుండానే భయం వచ్చేస్తుంది? ఎట్లా? అని ఇంట్లో వాళ్ళు పొమ్మన్నా నేను పోలేదు.

తరువాత విద్యానగర్ కాలనీ కట్టేటప్పుడు మెట్టు నుంచి నేను ఉదయం 7.30కి కాలనీకి చేరేవాడిని. ఒకరోజు మాస్టరుగారు చేతిలో బుక్స్ పట్టుకొని హుందాగా నడుచుకుంటూ వస్తున్నారు. దగ్గరకు రాగానే రోడ్డు ప్రక్కన నిల్చున్నాను. మాస్టరుగారు తలెత్తి చూశారు. "నమస్తే సార్" అన్నాను భయం భయంగా! ఆయన చిరునవ్వుతో, "మీ నాన్నగారు బాగున్నారా? ఇంట్లో అందరూ బాగున్నారా?" అన్నారు. "బాగున్నారు సార్"అన్నాను.తరువాత మాస్టరుగారు ఇంటికి వెళ్ళారు. మరురోజు కూడా అలాగే జరిగింది. నాకు బెరుకు తగ్గలేదు. వారిని ఎలాగైనా తప్పుకొని పోవాలని టైం మార్చేవాడిని, కాని కాలేజీ గేటు లోపల ఎక్కడో అక్కడ ఎదురై పలుకరించేవారు. ఒకరోజు ఇలా కాదు. కాలేజీ రోడ్డులో కాకుండా ఎరుకల వాళ్ళ ఇళ్ళు చుట్టుకొని వెళుతున్నాను. కాలేజీ క్యాంపస్ దాటాను. సరిగ్గా క్యాంపస్ దగ్గర నుంచి వస్తూ కనిపించారు. స్టన్ అయి నిలబడిపోయాను. ఆరోజు మాస్టరుగారు దివ్యతేజస్సుతో వెలిగిపోతున్నారు. నేను తినేసేటట్లు అలా చూస్తూ నిల్చున్నాను. వారే పలుకరించారు "బాగున్నావా?" అని. నేను మౌనంగా తలవూపాను. ఒక నిమిషమాగి బయలుదేరి వెళ్ళారు. నా మనస్సులో ఒకటే ఆలోచన. ఎందుకిలా జరుగుతుందని! నాకు తెలియకుండానే మరింతగా వారి మాయలో పడిపోతున్నాననిపించింది. ఒకరోజు మా నాన్నగారికిచ్చిన బాబా చరిత్ర ఇంటిలో వున్నది. కొన్ని పుటలు తిరగేశాను. ఎక్కడ చూచినా దానిలో ఎక్కువగా పొగడ్తలే! వేడుకోలే! నేను మొదటిసారిగా బాబా చరిత్రలో బల్లి పలుకులు గురించి బాబా చెప్పిన విషయాలు చదివాను. అందులో నాకు ఆధ్యాత్మికత ఏమీ కనిపించలేదు. తరువాత మధ్య పేజీలలో ఒక పేజీ చదివాను, అది చెన్నబసప్ప, వీరభద్రప్ప లీల! తరువాత 'టీ 'లో పంచదార లీల. ఆ లీలల అంతరార్థం నాకు బోధపడలేదు. నేను ఆధ్యాత్మికత అంటే ప్రాణాయామాలు, ఆసనాలు, ధ్యానం, బ్రహ్మం, జీవుడు, మాయ, ఆత్మ, వైరాగ్యం మొదలైనవి మాత్రమేనని అనుకునేవాణ్ణి. అందువలన బాబా చరిత్రంటే నాకు నచ్చక అది పూర్తిగా చదువలేదు. మా ఇంటిలో రామకృష్ణ పరమహంస చరిత్ర వుండేది. దాన్ని ఒకసారి చదివాను. మహాత్ములంటే రామకృష్ణ పరమహంసలాంటి వారేనని నమ్మేవాడిని. అందుకే చాలా రోజులవరకు బాబాచరిత్రే చదవలేదు.

ఒకరోజు స్కూలు పిల్లలందరమూ కలసి కోటకు సినిమాకు పోతూ విద్యానగర్‌లో మాస్టరుగారి ఇంటి వెనుక రోడ్డున వెళుతూ, ఒక్కసారి మాస్టరుగారిని చూసి వెళ్దాం అని వాళ్ళందరితో కలసి మాస్టరుగారి రూముకు వెళ్ళాం. లోపల వారు ఏవో కాగితాలు తిరగేస్తున్నారు. మేము రూములోకి వెళ్ళి ఒక్కొక్కరం వారికి నమస్కరించి విభూతి తీసుకొని పదిమందిమీ కూర్చున్నాం. అందరం 12 సం॥లోపు వాళ్ళమే. మాస్టరుగారు తన చేతిలోని కాగితాలు నా చేతికిస్తూ, "ఇందులోని బాబా లీలలు వారికి చదివి వినిపించు, ఇప్పుడే వస్తాను" అని లోపలికి వెళ్ళారు. నాకు గుండెల్లో రాయి పడింది. నేనెప్పుడూ పదిమందిలో అలా చదివింది లేదు. నాకు నోట మాట రాలేదు 2 నిమిషాలు. తర్వాత మా మిత్రులంతా

"చదువు! చదువు" అని ఒత్తిడి చేశారు. నేను గొణిగినట్లు చదువుతూ మధ్య మధ్య మాస్టరుగారు వచ్చే వైపుకు చూస్తున్నాను. వారు వస్తే అవి ఇచ్చేసి "పోయి వస్తాను సార్ " అనాలని, వారు వస్తేగా! నేను నెమ్మదిగా 'సకల దేవతా స్వరూపులు సాయి' అనే అధ్యాయం స్క్రిప్టును చదివాను. తరువాత 'సకల సాధు స్వరూపుడు' అనే అధ్యాయంలో అక్కల్కోట స్వామి లీల చదివేటప్పుడు వచ్చారు మాస్టరుగారు. వారు వచ్చిందే తడవు అందరం లేచి "పోయి వస్తాం సార్!" అని రూములోంచి బయటపడ్డాం.

అప్పటికి సత్సంగ సభ్యులెవరూ నాకు పరిచయం కాలేదు. నేనెప్పుడైనా పాలు తీసుకొని గురువారం వెళ్ళినా బిక్కు బిక్కుమంటూ దిక్కులు చూస్తూ నిల్చోటం, వారు "ఇప్పుడే తీసుకెళ్తావా? తర్వాత తీసుకెళ్తావా?" అనటం, నేనేదో వాగటం అక్కడ నుంచి బయట పడడం జరిగేది. అక్కడ అందరూ తక్కువగా మాట్లాడేవారు. నేను తప్ప అందరూ మాస్టరుగారితో చర్చలు చేసేవారు. లౌకికం అక్కడ లేదు, అంతా ఆధ్యాత్మికమే. కొన్నాళ్ళకు మొదటిసారిగా క్రిష్ణమూర్తి పరిచయం అయ్యారు. ఆ తర్వాత మెట్టు శ్రీనివాసులను మాస్టరుగారి రూములో చూశాను. అప్పటినుంచి అప్పుడప్పుడు అతను పలుకరించేవారు. తర్వాత ఒక్కొక్కరూ పరిచయం అయ్యారు.

రోడ్డు మీదనుంచి మాస్టరుగారి రూముకెళ్ళే దారిలో పిచ్చి చెట్లన్నీ పెరిగి వచ్చి పోయేవాళ్ళ కాళ్ళకు తగిలి ఇబ్బందిగా వుండేది. ఒక గురువారం ఒక సభ్యుడు దాని గురించి వాపోయాడు. అప్పుడు "పార వుంటే నేను వాటిని చెక్కేస్తాను" అని చెప్పాను. ఎవరింటి నుంచో పార తెచ్చారు. నాకై నేను మొదటిసారిగా చేసిన సేవ, మాస్టరుగారి సత్సంగ రూము నుంచి రోడ్డు వరకూ పెరిగిన పిచ్చి మొక్కల్ని చెక్కి, దారి చదును చేయటం! నాకు చాలా ఆనందంగా వుందా రోజు. ఏదో విధంగా మాస్టరుగారికి సేవ చేయాలని, వారిని మెప్పించాలని, వారికి సంతోషం కలిగే పనులు చేయాలని వుండేది. విద్యానగర్ సెంటర్లో ఒకసారి షాపు ముందు నిల్చొని వున్నాను. 11.30 మధ్యాహ్నం. షాపతను మాట్లాడుతున్నాడు. నేను ప్రక్కకు చూస్తే ప్రక్కన మాస్టరుగారు నిల్చొని వున్నారు. సడన్ గా లేచి భయంతో "నమస్కారం సార్" అన్నాను. "బాగున్నావా?" అని షాపులో సిగిరెట్లు తీసుకొని రూముకెళ్ళారు మాస్టరుగారు. ఒక గంట దాకా భయం పోలేదు నాకు.

సత్సంగంలో చాలా మంది ప్రశ్నలు వేసేవారు. నేను ఏదో ఒకటి వారిని అడగాలని "విగ్రహారాధన తప్పు కదా సార్?" అన్నాను గొప్ప ప్రశ్న వేశాననే గర్వంతో. "ఎలా అవుతుంది? అంతటా భగవంతుడున్నాడా? లేడా?" అన్నారు. "అంతటా వున్నాడు సార్" అని అన్నాను. "అయితే ఈ రూపంలో కూడా వున్నాడుగా?" అన్నారు. నాకేమనాలో తెలియక తల వాల్చేసాను. ఆరోజు నుంచి ఎలాగైనా వారు చేసే పనిలోగాని, మాటల్లోగాని తప్పు దొరుకుతుందేమోనని ఎదురుచూడసాగాను. దాన్ని అడగాలని అనుకున్నాను. కానీ వారు చిక్కితేగా. జీవితాంతం నన్నే చిక్కించుకొన్నారు వారి వలలో.

తర్వాత ప్రతి గురువారం విధిగా, నియమంగా సత్సంగానికి హాజరై వారిని గమనిస్తూ వుండేవాడిని. వారి ప్రతి కదలిక చాలా చిత్రంగా, వింతగా నాకు కనిపించేది. సిగిరెట్లు కాల్చడం, పెదాలపై పెట్టుకుని మాట్లాడ్డం, కాలు బారచాపి, కాలుపై వేదమ్మను పడుకోబెట్టుకుని వూపుతూ, సత్సంగంలో చదవడం, ఎంతో శ్రద్ధగా ప్రశ్నలు వేసిన వారికి సమాధానాలు చెప్పటం చూస్తే ఆశ్చర్యమేసేది నాకు! మనం చేయలేనివి చాలా ఆయనకు తెలుసు అని అనిపించేది. ఒకటి చెవులను వాటంతటవే కదిలేటట్లు ఆడించడం! ఒక్కొక్కసారి అందరూ కలిసి ప్రశ్నలతో దాడికి దిగేవారు! ఆ సమయంలో వారి ముఖంలో ఎలాంటి ఆదుర్దా గాని, విసుగు గాని, గాభరా గాని లేకుండా, అంతమందిని ధైర్యంతో ఎదుర్కోవటం అన్నింటికన్నా నాకు థ్రిల్లింగ్ గా వుండేది. నా దృష్టిలో వారు గొప్ప హీరో! ఇంకా గురువారం నాడు టెంకాయలు కొట్టటం మరీ చిత్రంగా వుండేది నాకు! టెంకాయను ఒక చేతిలో, ఇంకొక చేతిలో రాయిని వుంచుకుని రెంటినీ కలిపి ఒక్కసారి కొట్టంగానే, నీరు గిన్నెలో కారటం జరిగేది. మామూలుగా టెంకాయను నేల మీద గాని, రాతి మీద గాని కొట్టడం చూసేవాడిని నేను! అందుకే నాకు - చిత్రంగా తోచేది. వారు అంత శ్రమపడి ప్రసాదమంతా నివేదించాక, బాబాకు హారతి ఇచ్చేవారు. బాబా వైపు హారతి ఇస్తుంటే నేను మాస్టరుగారి ముఖం చూసేవాడిని. వారి చూపులో బాబా

యెడల భక్తి, శ్రద్ధ, వారి ముఖంలో హారతి వెలుగు పడి ముఖం ఎర్రగా ఎంతో తేజస్సుతో వెలిగేది! తర్వాత "సాయినాథ్ మహారాజ్ కీ జై' అని అందరూ హారతి కళ్ళకద్దుకుని, వారి దగ్గర విభూది, ప్రసాదం తీసుకొని మా వూరు వెళ్ళేవారు. నేను వెళ్తే వాళ్ళతో వెళ్ళేవాడిని లేకుంటే ఆ రాత్రికి కాలేజీ హాస్టల్ లో, మా వూరి వాళ్ళబ్బాయి వుంటే అక్కడికి వెళ్ళి పడుకునేవాడిని. మరలా గురువారం వచ్చేదాకా మామూలు ఆటలు, పాటలతో గడిచిపోయేది.

గురువారం సత్సంగం అయిన తరువాత మాస్టరుగారు భజన చెప్తుంటే ఎంతో మధురంగా వుండి, మరలా మరలా వినాలనిపించేది. మామూలుగా భజన చేసేవాళ్ళను మేము వెక్కిరించే వాళ్ళం! "గొప్ప భక్తులోయ్! భజన చేస్తే ఏమోస్తుందోయ్! ధర్మంగా వుండాలి గానీ" అని వాళ్ళ బలహీనతలను గూర్చి విమర్శించేవాళ్ళం! అలాంటి మమ్మల్ని కూడా భజన చేసేటట్లు చేశారు! సామాన్యుడు కాదు! "కాలేజీ వాళ్ళ చేత భజన చేయించేవాడే! అబ్బో సామాన్యుడు కాదయ్యా ఆయన!" అని అనుకునేవారు. ఆ రోజుల్లో దేవునికి దణ్ణం పెట్టేటప్పుడు కూడా ఎవరైనా చూస్తారేమో అని భయపడేవాళ్ళం! ఎవరైనా చూశారనుకోండి వాళ్ళు "గొప్ప భక్తులు బయలుదేరారండీ" అని ఎగతాళి చేస్తారనే బెరుకు, వారికి సమాధానం చెప్పలేకపోతామనే భావన వల్ల! అలాంటి రోజుల్లో వారి రూముకు వెళ్ళి రావడమంటే "సన్యాసులలో చేరారండీ వీరంతా!" అనే ఎక్కసపు మాటలు వినాల్సి వచ్చేది! ఒక్కొక్కసారి అటూ ఇటూ చూసి గురువుగారి రూములోకి వెళ్ళేవాడిని. భజనలో నామాలను అనేకసార్లు మరలా మరలా చెప్పేవారు! వారు ఎన్నిసార్లు చెప్పినా, నాకు ఎప్పుడూ విసుగు అన్పించక ఎంతో తీవ్రంగా ధ్యానస్థమయ్యేది నా మనస్సు!

ఒక గురువారం భజన అయ్యాక కొబ్బరికాయలు కొట్టేందుకు మాస్టరుగారు ఉద్యుక్తులైతే "నేను టెంకాయలు కొట్టాను సార్" అని ధైర్యం చేసి అడిగాను. ఒక్కసారి నా వైపు తీక్షణంగా చూశారు. అప్పుడు "నేను టెంకాయలు కొట్టి ప్రసాదంతో కలిపి పెడుతుంటాను. మీరు విభూది, తీర్థం ఇవ్వండి" అన్నాను. వారితో అంత సేపు మాట్లాడటం అదే మొదటిసారి. నేను చాలా గట్టి పట్టుదలతో వున్నాను. ఆ సేవ నేను చేసి మాస్టరుగారికి శ్రమ తగ్గించాలనేదే నా భావం! అంతకుమించి నేనేమీ భావించలేదు. గురువుగారు నా భావానికి కాస్త మెత్తబడ్డారు. అప్పటినుంచి ప్రతి గురువారం టెంకాయలు కొట్టడం, నైవేద్యాలన్నీ బాబాకు నివేదించాక, అన్ని ప్రసాదాలు ఒక పెద్ద డిష్ లో కలిపి వచ్చిన వారందరికీ పెట్టడం జరిగేది! ఒక్కొక్కసారి ఎక్కువమంది వచ్చేవారు. వారందరికీ పెట్టేసరికి మాస్టరుగారికి, నాకు ప్రసాదమే వుండేది కాదు. డిష్ కు అడుగున, అంచులకు అంటుకొని వున్న దానిని వేలితో నాకు కొద్దిగా పెట్టేవారు. ఆయన తీసుకొనేవారు. మాస్టరుగారు ఒకసారి భజన నన్ను చెప్పమన్నారు. నేను బిక్కచచ్చిపోయాను! నాకు నలుగురిలో పాటలు, భజనలు చెప్పాలంటే బెరుకు. కాని అంతకు ముందు ఒకసారి నా మనస్సులో నన్ను భజన చేయమని చెప్పితే, నేను కూడా భజన చెప్తాను కదా! అనుకున్నాను. కాని నాకప్పుడు అది గుర్తు రాలేదు. భయం, భయంగా మొదలు పెట్టాను. మొదట గురుబ్రహ్మ అందరూ కలిపి చెప్తారు కాబట్టి గుంపులో గోవిందలా జరిగింది మానసభజరే నెమ్మదిగా చెప్పాను. తర్వాత "గురుదేవ దత్తా సాయిరాం" ముందు చరణాలు వెనుకా, వెనుక చరణాలు ముందు చెప్పి ఎలాగో దాన్ని ముగించి, అరుణాచలశివ మొదలు పెట్టాను. రెండవ చరణాన్ని ఎలా అనాలో తెలియక మొదటి దానిలాగా అని ముగించాను. ఓం నమశ్శివాయ చాలా సులభమైన భజన. ఎలాగో అలా భజన ముగించి తర్వాత అందరి ముఖాల వంక చూశాను. అందరూ నా కంగారుని గానీ, అవకతవకలను గానీ పట్టించుకోక బాబా యందు భక్తి, శ్రద్దలతో వున్నారు. నాకు లోపల కంగారు తగ్గనేలేదు. నాకప్పుడు అన్పించింది, కొన్ని రోజుల క్రిందట నా మనస్సులో "నేనైతే బాగా భజన చేస్తా కదా! వాళ్ళకన్నా " అని మూల్గిన దానికి తగిన శాస్తి జరిగింది. ఇంక మాట్లాడితే ఒట్టు! అప్పుడప్పుడు భాస్కరు, దామూ, నేను భజన చెప్పేవాళ్ళం. మాస్టరుగారు లేనప్పుడు ఎక్కువగా భాస్కరే చెప్పేవాడు. తర్వాత అతను రానిరోజు మాస్టరుగారు ఒక్కొక్కసారి నన్ను "నువ్వు చెబుతావా" అంటే నేను చెప్పేవాడిని, ఒక్కొక్కసారి దామూ చెప్పేవాడు.

- సశేషం

నార్కే

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

మోక్షం కోసం ప్రయత్నించమని, అందుకోసం వివేక వైరాగ్యాలు అవలంబించమనీ ఆయన చెప్పగా నేనెన్నడూ వినలేదు. 'భగవంతుని చేరడమే లక్ష్యం' అని మాత్రమే చెప్పేవారు. – అల్లా మిళనారా సప్తసముద్ర నిఘాలాకారణ్' – 'భగవంతుని చేరడానికి సప్తసముద్రాలు మరియు లోకాలు దాటిపోవాలి' 'వేడాపార్ కర్ నా' 'బంధాలను దాటిపోవాలి' యిలా మాత్రమే చెప్పేవారు. నాకు తెలిసినంతలో ఆయన మాయ గురించి ఎన్నడూ చెప్పలేదు. ఇహలోకము మరియు పరలోకాలు వాస్తవమైనవేనని, ఆ రెంటిలో మనం సాధ్యమైనంత శ్రేయస్సు పొందాలన్న సామాన్యదృష్టినే ఆయన వహించేవారు.

బాబాకు 'భగవద్గీత', 'భావార్థరామాయణం', 'ఏకనాథ భాగవతం', 'పంచదశి', 'యోగవాశిష్ఠం', పురాణాలు మొ॥న సద్గ్రంథాలపట్ల ఎంతో గౌరవం. 'పంచదశి', గురించి ఖాపర్డేతో, "ఏతో హమారా ఖజానా హై' 'ఇది మా ధనాగారం' అన్నారట. నన్ను మొదటిరోజుల్లో (1914) ఆయన అనేకసార్లు ₹15/-లు దక్షిణ యివ్వమని అడిగారు. నేను "నావద్ద డబ్బులేదని మీకు తెలుసుగదా, నన్ను ₹15/- దక్షిణ అడుగుతారెందుకు?" అని అడిగాను. బాబా తమకు నావద్ద డబ్బు లేదన్నసంగతి బాగా తెలుసు అనిచెప్పి, "నీవిప్పుడు 'యోగవాశిష్ఠం' చదువుతున్నావు గదా! ప్రస్తుతం నీవు చదువుతున్న భాగం ఎంతో ముఖ్యమయినది. దానినుండి నాకు ₹15/-లు దక్షిణ యివ్వు" అన్నారు. అంటే దానినుండి విలువైన విషయాలు సేకరించి నా హృదయస్థులైన ఆయన చెంత పదిలపరచుకొమ్మని వారి భావం.

ఆసనాలు, ప్రాణాయామము, ధ్యానము, కుండలినీ శక్తిని మేల్కొలపడం ద్వారా అతీతమైన శక్తులు సంపాదించడం గురించి ఆయనెన్నడూ లెక్క పెట్టలేదు. నాకు తెలిసినంతవరకూ ఆయన బోధించే మార్గమదిగాదు. సరిగదా, 'ప్రాణాయామ మార్గంలో పయనించేవారుగూడ చివరకు ఉన్నతి పొందడానికి నావద్దకొచ్చి తీరాలి' అనేవారు. సమాజంలోనే నివసిస్తూ వస్తువులు వుత్పత్తి చేయడానికి శ్రమిస్తుండాలన్న సూత్రం వారే ఆచరించి చూపారు. ఆయన గోధుమలు పిండిగా విసురుతుండేవారు. ఆయన ఎంతో పరిమితంగా భిక్ష చేసినది (కేవలం ఋణానుబంధాన్ని అనుసరించి కాబోలు) కొద్దిపాటి భోజనం కోసం మాత్రమే. వారు దక్షిణ అడగడానికి మాత్రం ఎన్నో కారణాలున్నాయి; ప్రధానమైనది ఋణానుబంధం తీర్చుకోడమే. సామాన్యులైన భక్తులందరూ గృహస్థ జీవితాలు కొనసాగించడమే వారి అభిమతం గాని, వారు సన్యసించి, సమాజాన్ని విడచి భిక్షమెత్తుకోవాలని ఎన్నడూ చెప్పలేదు. ఆయన నన్ను, వామనరావ్ ను భిక్షకు పంపినది గూడ మాకోసం గాదు, గురువుకోసం మాత్రమే – గురుసేవగా మాత్రమే. ఆయనలా ఎప్పుడూ మాటల్లో చెప్పకపోయినా, విచక్షణ లేకుండా భిక్షమెత్తుకొనడం వలన మనం కూడబెట్టుకున్న పుణ్యం నష్టమౌతుందని వారు తలచేవారని నాకు తోస్తుంది.

ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు చదివి వాటి ప్రకారం ఆత్మవిచారం చేయడం వారి పద్ధతిగాదు, ధ్యేయమూగాదు. వారి అభిమతమేమో వారు చెప్పలేదు గాని, వారి భక్తులు

వారివలెనే అవ్వాలని ఆయన కోరేవారని వారి ఆచరణయే తెల్పుతుంది. వారి ఎరుక మన దేశకాలాలను అతిక్రమించి అన్ని లోకాలలోనూ మూల మూలలకూ వ్యాపించి వుండేది. సుదూరమైన గతంనుండి వర్తమానము, భవిష్యత్తూగూడ వారికి క్షుణ్ణంగా తెలుసు. జీవుడు ఏయే లోకాలలో నివసిస్తే ఎటువంటి సుఖాలనుభవించగలడో ఆయనకు బాగా తెలుసు. ఆయనకు స్పష్టంగా అంతా తెలిసిగూడ వాటిపట్ల వ్యామోహం విడిచి పెట్టారు. ఎన్నో ఆకర్షణల మధ్యగూడ ఆయన పూర్తిగా నిర్లిప్తుడు. కనుక వారి జీవితమే నిజమైన వైరాగ్యం. భగవంతుని చెంతకు చేర్చే నిష్కామకర్మ.

అందరు మహనీయులవలె బాబా యొక్క ప్రధానమైన మార్గం భక్తి. భగవంతుని ఆదేశాలకు విధేయులమై వుండడం, ఆయనను భక్తితో సేవిస్తూండడం అందులోని ముఖ్యాంశాలు. గురుభక్తిని ఆధారంగా చేసుకొని దైవభక్తిని పెంపొందించుకోవడమెంతో ముఖ్యమని సాయి తమ ఆచరణ, మరియు మాటలద్వారా ప్రత్యేకంగా చెప్పేవారు. గురురూపంలో దైవాన్ని దర్శించడమే వారి ప్రధాన సూత్రం. సిసలైన బ్రాహ్మలంటే బాబాకెంతో గౌరవం. బ్రాహ్మ లెంతో పుణ్యమార్జిస్తారు అనేవారు.

శిష్యుడు వేరు, భక్తుడు వేరు. శిష్యునితో సన్నిహిత సంబంధం కల్గియుండి అతని బాధ్యతంతా గురువు వహిస్తారు. ఆయనకెవరితోనూ అంత సన్నిహితమైన బంధం లేదు; ఎవరి పాపాలను, దుఃఖాలనూ భరించవలసిన బాధ్యత ఆయనకు లేదు. సాయిబాబాకు శిష్యుడే లేరు. శిష్యుడంటే గురుసేవ చేస్తూ, వారి అభీష్టాలన్నింటినీ 'తు-చ' తప్పకుండా నిర్వర్తించాలి. "నా గురువు సన్నిధికి వెళ్ళాలంటే నేను వణికిపోయేవాడిని" అనేవారు సాయి. శిరిడీలో ఆయన నలా సేవించడానికి సంసిద్ధులైన వారెవ్వరూ లేరు. ఆయనొకసారి, "నా శిష్యులమని చెప్పుకోగలవారెవరు? తగినంత తృప్తిగా నన్ను సేవించగల వాడెవడు?" అన్నారని గూడ విన్నాను.

తమను ఆశ్రయించిన భక్తులను సంస్కరించడానికి వాచా బోధించడమన్నది వారి పద్ధతి గాదు. వారు చెప్పే నీతికథలు, అరుదుగా యిచ్చే కొద్దిపాటి ఆదేశాలు వాచా బోధించడమే గావచ్చుగాక. కాని అవెంతో అరుదు. వారి సాంప్రదాయకమైన పద్ధతికంటె వాటి ప్రభావమేమీ ఎక్కువైనది గాదు. వారి సాంప్రదాయం ప్రకారం గురువును శరణు పొందే శిష్యుడు శుద్ధుడు, పవిత్రుడూ అయివుండాలి. కాని అతడు జపము, ధ్యానమువంటి సాధనలేవీ చేయనక్కరలేదు. సరిగదా, 'నేనీ సాధన చేస్తున్నాను' అన్న భావంతో మాత్రమే చేయసాధ్యమైన సాధనలు అంతరాయాలే గూడ. కర్తృత్వంతో గూడిన భక్తుని అహంకారమంతా అతని గుర్తింపులోనే లేకుండా తుడిచి పెట్టుకొని పోవాలి. కారణం అది గురువుయొక్క అనుగ్రహానికి అవరోధం. గురువు వాచా ఏమీ బోధించరు; తమ ప్రభావాన్ని విరజిమ్ముతారు. ఆయన ఒలికించే అట్టి ప్రభావాన్ని శిష్యుడు తన ఆత్మలో యిముడ్చుకోవాలి. అట్టిది పూర్తిగా ఆత్మసమర్పణ చేసుకున్న వారికే సాధ్యం. వేరు సాధనలు చేయడానికి అవసరమయ్యే అభిమానం అహంకారాన్ని బలపరచి, గురుకృపకు అడ్డమౌతుంది. సాయిని దర్శించే వారిలో లోతుగా గమనించగల వారందరూ యీ విషయం గుర్తించే వుంటారు. కొందరు భక్తులతో ఆయన, 'నీవు నాచెంత వూరికే వుండు; అవసరమైనదంతా నేనే చేస్తాను' అని చెప్పారు. అయితే ఆయనయందు విశ్వాసముండడం ఎంతో అవసరం.

అయితేనేమి, వారిని దర్శించి కొద్దిసేపు వారిచెంత వుంటే చాలు, తక్షణమే విశ్వాసం కుదురుతుంది. బాబా ప్రతి భక్తుని హృదయంలోకీ చూడగలరు. దేశకాలాల హద్దులు దాటి భూతభవిష్యత్తులతోపాటు ఎక్కడెక్కడి సంగతులో తెలుసుకోగలరు. ఇట్టి తమ సామర్థ్యం భక్తునికి చూపి అప్పటికప్పుడే విశ్వాసం కల్గించేవారు. ఇందులో ఏదీ గుడ్డివిశ్వాసంతో ఆమోదించవలసిన పనిలేదు. భక్తులు ఆయననుండి పొందే ఐహికము, పారమార్థికమూ అయిన శ్రేయస్సు ఎంతో స్పష్టమైనది, తానెక్కడికి వెళ్లినా, ఏం చేస్తున్నాగూడ ఎల్లప్పుడూ వారి కళ్ళ ఎదుటే వుంటానని భక్తుని మనసులో చెరగరాని రీతిన ముద్రించుకుపోయేది. ఐహికంగానూ, పారమార్థికంగానూ గూడ తనకు పొడుగునా అట్టి మార్గదర్శకం లభించగలదన్న విశ్వాసం అతనికి కుదిరేది. ప్రపంచ వ్యవహారా లన్నింటితోపాటు మన విధినిగూడ అప్పటికప్పుడే నియమించగల శక్తి వారిది. భవిష్యత్తులో గూడ యీలోకంలోగాని, పరలోకాలలోగాని మన విధిని నిర్ణయించేది ఆయన శక్తియేనన్న విశ్వాసం మనకు కుదిరేది.

కనుక భక్తుని కర్తవ్యమల్లా 1)

సౌశీల్యము, పవిత్రత, నిరాడంబరాలు అలవరచుకొని గురుకృపకు పాత్రుడుగా వుండడము. మరియు 2) విశ్వాసంతో హృదయపూర్వకంగా వారిపై దృష్టి నిలపడము. 3) నిగూఢమైన రీతిన మలచుకొని, అంతకంతకూ వున్నతమైన అనుభవాలకు అర్హులుగా రూపొందించి సుదూరమైన గమ్యం చేర్చగలరని విశ్వసించడమే. 'తడవకు ఒక్క అడుగు ముందుకు వేయగలిగితే చాలు' అన్నదే సరైన వైఖరి; జటిలమైన తాత్త్విక సిద్ధాంతాలు పరిశోధించి మన చరమలక్ష్యం నిర్ణయించుకోవలసిన పనిలేదు. ఆ గురువే అతనిని ఉద్ధరించి అతీతమైన శక్తులు, అపారమైన విజ్ఞానము, మరియు అంతకంతకూ అనుభవమయ్యే జ్ఞానమూ ప్రసాదిస్తారు. మన చరమలక్ష్యం సంగతి నమ్మికతో ఆయనకు విడిచి పెట్టడమే శ్రేయస్కరం. ఇదంతా ఆయనెన్నడూ నాతోగాని, లేక నా సమక్షంలోగాని ఎన్నడూ ఒక్కసారిగా చెప్పలేదు. వారి ఆచరణనుండి, అందరితో ఆయన వ్యవహరించే పద్ధతినుండి, అరుదుగా ఆయన చెప్పే మాటలనుండి నేను సేకరించుకొన్న ముఖ్యాంశాలే యివి. అది సత్యమేనని మనం ఆలోచించుకున్నా తెలుస్తుంది.

జీవితంలో అనుభవించవలసిన సుఖమెంతవున్నదో, మరియు తాను పరిత్యజిస్తున్న విషయాలెలాటివో తెలుసుకోకుండానే వివేక వైరాగ్యాల గురించి మాటలు చెప్పడం ఆత్మవంచన, పరవంచనా మాత్రమేనని నా అభిప్రాయం. అది గ్రంథ వేదాంతమే గాని నిజమైనదిగాదు. వాస్తవికమైన జీవితం యొక్క తాకిడికి అది నిలువజాలదు. వీటితో తమ జీవితాలను నింపుకొనే శక్తి లేకుండానే వీటి గురించి మాట్లాడేవారు వంచకులు. బాబా, 'నేను ప్రతికుక్క, పంది, బల్లిలోగూడ వున్నాను' అన్నప్పుడు ఆయనకు నిజంగా అట్టి అనుభవమున్నది. వాటిపట్ల ఎవరెలా ప్రవర్తించినా వాటికెలా అన్పిస్తుందో ఆయన స్పష్టంగా చెప్పగలిగేవారు. ఇతరులు ఆ మాట భగవద్గీత మొ॥న గ్రంథాలలో వున్నది గాబట్టి, అది నిజమని నమ్ముతున్నారు గాబట్టి మాత్రమే చెబుతున్నారు. వారికి అట్టి అనుభవం మాత్రం వుండదు. అలాటి మాటలు వంచనకు మాత్రమే దారితీస్తాయి.

భక్తులు తమను దైవమని తలుస్తున్నంత మాత్రాన తాము ధర్మానికి అతీతులమని ఆయనెన్నడూ తలచలేదు, అలా ప్రవర్తించడానికి దానిని వినియోగించుకోనూలేదు, సరికదా, ధర్మశాస్త్రాలనుగాని, దేశమంతటా అమలులోవున్న నైతిక సూత్రాలుగాని ఆయనెన్నడూ ఉల్లంఘించలేదు. ఆయన వేషభాషలలో సభ్యత ఎన్నడూ లోపించలేదు. స్త్రీలతో ఎప్పుడూ ముక్తసరిగా వ్యవహరించేవారు. ఆయన సామాన్యంగా సర్వశక్తిమంతుడైన భగవంతుని భక్తుడుగా మాత్రమే వ్యవహరించేవారు. 'అల్లా మాలిక్' 'భగవంతుడే యజమాని', 'అల్లా భల్లాకరేగా'-'భగవంతుడనుగ్రహిస్తాడు' అనే ఆయనెప్పుడూ అనేవారు. 'నేను భగవంతుని బానిసను. నేనెప్పుడూ భగవంతుని గుర్తు పెట్టుకుంటాను' అనిగూడా అనేవారు. ఎంతో అరుదుగా మాత్రమే అదిగూడ వారొక అతీతమైన స్థితిలో వున్నప్పుడు - 'నేను, దైవం ఒక్కటే!' అన్నారు.

బాబా పాటించినది అస్ఖలిత బ్రహ్మచర్యం. మెరిసిపోతుండే వారి కళ్ళు ఆ సంగతి స్పష్టం చేసేవి. స్త్రీలనెప్పుడూ తగినంత దూరంలో వుంచేవారు. వారిలో చాలా కొద్దిమందిని మాత్రమే తమ పాదాలొత్త నిచ్చేవారు.

ఆయనెప్పుడూ చక్కగా తమ శరీరాన్ని కప్పుకొని వుండేవారుగాని, అసభ్యంగా వస్త్రాలు తొలగనిచ్చేవారుగాదు. ఆయనెంతో నిష్పక్షపాతంగాను, న్యాయంగాను వుండేవారు. ఎంతో ధనము, ఉన్నతమైన పదవిగల వ్యక్తులొచ్చినా వారిని ఆయన పట్టించుకొనేవారు గాదు. పైపై మెరుగుల మాటునున్న ఆ వ్యక్తుల హృదయాలను చూచేవారు. కాని, వ్యక్తి ఎంత పేదవాడైనా అతనిని ఆయనెంతో ప్రశంసించి, 'ఇతడికెంతో సంపద (పుణ్యం) వున్నది' అనేవారు. వారిచుట్టూ చేరే వ్యక్తులను బట్టి ఏ మహాత్ముణ్ణి అంచనా వేయగూడదు. వేశ్యలు, విటులు, దురాశాపరులు, అనేక రకాల పాపాలు చేసినవారుగూడ లౌకికమైన లాభంకోరి ఆయనను దర్శించేవారు. ఆయన సన్నిధిని వినియోగించుకొని బాగుపడక పాపాలకు లోనయ్యేవారిని ఆయన విడిచి పెట్టేవారు. వారి న్యాయసూత్రమెంతో కఠినమైనది. 'గర్భంలోని బిడ్డ అడ్డం తిరిగినపుడు మన బిడ్డనైనా సరే కోసివేయవలసిందే' అనేవారు.

నవంబరు 5,1918న ప్రొఫెసర్ జి.జి.నార్కే తన సాటి సాయిబాబా భక్తుడైన దాదాసాహెబ్ ఖాపర్డేకు యిలా ఒక జాబులో వ్రాసాడు:

సెప్టెంబరు 28, 1918న శ్రీసాయికి కొంచెం అస్వస్థత చేసింది. నేను అక్టోబర్ 2న శిరిడీ వెళ్ళాను. ఇలా అస్వస్థత చేసిన 17వ రోజున ఆయన మహాసమాధి చెందారు. ఆ చివరి రోజులలో ఆయన ఆహారం తీసుకొనడం మానేసి బాగా

శుష్కించిపోయారు. ఆయన తరచుగా ఏదో ఒకటి అంటూనే వున్నారు. కాని ఆ మాటలేవీ నాకు గుర్తులేవు. అపుడు సోదరుడు దాదాసాహెబ్ గూడ శిరిడీలోనే వున్నారు. బాబా ఆయనను తమ మహాసమాధికి ముందే బొంబాయికి పంపివేశారు. అయినా తర్వాత బాబా పరిస్థితి ఏమీ బాగాలేదని తెలియగానే అతడు మరలా ఆత్రుతగా శిరిడీ చేరాడు. ఆ తర్వాత మూడు రోజులకు సాయి పరమపదించారు.

అంతకుముందు ఒకటిన్నర సంవత్సరంనుండీ నానాసాహెబ్ నిమోన్కర్ సాయి సన్నిధిలోనే వుంటూ వారిని రాత్రింబగళ్ళు కనిపెట్టుకునే వున్నాడు. మహాసమాధి చెందడానికి రెండు రోజులు ముందువరకూ గూడ బాబా రోజూ లెండీకి వెళ్ళివస్తూనే వున్నారు. అలానే భక్తుల సహాయంతో నిత్యమూ భిక్షకు వెళ్ళివస్తూనే వున్నారు. ఇక రెండు రోజులలో నిర్యాణం చెందుతారనగా ఆయన భిక్షకు వెళ్ళడం మానివేశారు. తరచుగా సాయి తమ భక్తులతో, 'మీరెవరూ శోకించగూడదు!' అని హెచ్చరిస్తున్నారు.

తమ జీవితంలో చివరి క్షణం వరకూ గూడ సాయి సంపూర్ణమైన ప్రజ్ఞతో వున్నారు. నాడు మధ్యాహ్నం ఆరతి పూర్తికాగానే బాపూసాహెబ్ జోగ్, కాకాసాహెబ్ దీక్షిత్ మొ॥న భక్తులందరినీ 'గదులకు వెళ్ళి భోజనం చేయమని' ఆయన ఆదేశించారు. నిత్యమూ మామూలుగా వీరందరూ ఆయనతో కలిసి మశీదులోనే భోజనం చేసేవారు. వారంతా తమ తమ గదులకు వెళ్ళగానే సాయి తమ భౌతికదేహం విడిచి పెట్టారు. తమ యథాస్థానంలోనే ఎప్పుడూ కూర్చునట్లే కూర్చొని, భయ్యాజీ మీదకు వొరిగి చివరి శ్వాస విడిచారు.

అంత తీవ్రంగా అన్ని రోజులు అస్వస్థతగా వున్నపుడు గూడ బాబా ఒక్కసారిగూడ నేలపై విశ్రమించలేదు. రోజంతా కూర్చొనే వున్నారు. చావడిలో నిద్రించిన రాత్రులప్పుడు మాత్రమే ఆయన హాయిగా కాళ్ళు చాపుకొని పడుకొనేవారు.

అంతిమక్షణంలో ఆయన శ్వాస ఆగిపోవడం చూచిన భాగోజీ ఆ విషయం నిమోన్కర్ తో చెప్పాడు. వెంటనే నిమోన్కర్ పెద్దగా 'దేవా!' అని గుండెలు బ్రద్దలయ్యేలా శోకించాడు. మరుక్షణమే సాయి కన్నులు తెరచి సమాధానంగా 'ఓయ్' అని పల్కారు. ఇది జరిగినది మంగళవారం మధ్యాహ్నం 2గం॥35 ని॥లకు.

నాటి రాత్రంతా బూటీ వాడాలో సమాధి త్రవ్వుతున్నారు. మరుసటిరోజు ఒక యిబ్బంది కల్గింది. బొంబాయినుండి అమీన్ భాయ్ సక్కర్ వస్తూ కోపర్గావ్ నుండి ఆవూరి మమల్తదారును తీసుకువచ్చి ఒక వివాదం లేవనెత్తాడు. అతడు బాబాదేహాన్ని ఆరుబయట పొలంలో సమాధి చేయాలన్నాడు. అప్పుడు అచట చేరిన భక్తుల అభిప్రాయం సేకరించారు. ఎక్కువమంది బాబా దేహాన్ని బూటీవాడాలోనే సమాధి చెయ్యాలన్న అభిప్రాయం వెలిబుచ్చారు. ఆ విషయం జిల్లా కలెక్టరుకు గూడ తెలిపారు. ప్రతివాదుల్ని తమ మనస్సులు మార్చుకొనేలాగా బాబాయే ప్రేరేపించారు.

బుధవారం సాయంత్రం బాబా దేహాన్ని శిరిడీలో ఊరేగించి బూటీవాడాలోనే హాలులో వుంచారు. ఆ సమాధి క్రతువంతా హిందూ సంప్రదాయం ప్రకారమే జరిగింది.

అంతకు నాలుగైదు రోజులు ముందు సోనీ అనే భక్తుని తల్లిని పిలచి, 'ఈ మశీదులోను, చావడిలోను వుండటం నాకు రోతగా వున్నది. ఇక్కడనుండి నేను వెళ్ళి (బూటీ) వాడాలో వుంటాను. నన్ను అక్కడే కనిపెట్టుకుని అందరూ వుంటారు' అన్నారు బాబా.

అంతకు నాలుగైదు సం॥లకు పూర్వమే శ్రీమతిజోగ్ కు ఆయన అచ్చటి ఆరుబయట ప్రదేశం చూపించి, 'ఇక్కడొక పెద్ద భవనం లేస్తుంది. అపుడు నేనిక్కడ కూర్చొని వుంటాను' అని చెప్పారు. మహాసమాధి అయిన రోజున భక్తులు ₹.2,400/-లు పోగుచేసి భారీయెత్తున అన్న సంతర్పణ చేసారు.

బాబా దేహాన్ని దాదాపు 36 గం॥ వుంచినా అది కొంచెంగూడ బిగిసిపోలేదు. ఆయన పరమపదించిన మరురోజు, అంటే బుధవారంనాడు, వారి నోటినుండి కొద్దిగా రక్తం వచ్చిందిగాని, శరీరం గట్టిపడలేదు. ఎటు కదిలిస్తే అటు అతి సునాయాసంగా వంగింది. పాత కఫ్నీ విప్పడంగూడ ఎంతో తేలికగా వీలుపడింది.

బాబా మహాసమాధి చెందాక అహ్మద్ నగర్ జిల్లా ప్రభుత్వాధికారులు, పుర ప్రముఖులూ కలసి శ్రీసాయి విడిచి వెళ్ళిన వస్తుసామగ్రికి అధికారులైన వారసులు, లేక బంధువులు ఎవరైనా వుంటే వాటిని స్వాధీనం చేసుకోవచ్చని ప్రకటించారు. కాని అలాటి వారెవరూ ముందుకురాలేదు. ఆయన పత్రిలో జన్మించిన మాట నిజమైతే ఎవరైనా ముందుకు వచ్చేవారేగదా!

ద్వారకామాయి అనుభవమండపము

అది 1947. నేను బెల్గాంలో ఆరవ తరగతి చదువుతున్నాను. ఒకరోజు మా బంధువులొకరు ఆ వూరిలో ఒక రైల్వేస్టేషన్ మాస్టర్ గారింట్లో జరుగుతున్న సాయిబాబా పూజకు తీసుకువెళ్ళారు. ఎన్ని జన్మల పుణ్యఫలమోగాని అక్కడున్న ఆ చక్కని సాయి చిత్రపటం నన్ను మంత్రముగ్ధుణ్ణి చేసింది. హృదయపూర్వకంగా తలవంచి సాయికి నమస్కరించాను. ఆయన చిరునవ్వుతో నా నమస్కారం స్వీకరించి ఆశీర్వదించినట్లు నా హృదయానికి అన్పించింది. నాటి నుండి నేను శ్రీసాయి భక్తుడనయ్యాను. ఆయనదప్ప నాకు వేరొక యిష్టదైవం లేరు. నా జీవితంలోని ప్రతి రంగంలోనూ ఆయన నన్ను సరియైన మార్గాన నడిపిస్తూ కాపాడుతున్నారు. ఆయన భక్తుడను కాగల్గడమెంతటి భాగ్యమోనన్పిస్తుంది. నేను జన్మతః నిరుపేద కుటుంబానికి చెందినవాడనే గాని సాయి అనుగ్రహమనే మహాభాగ్యం నన్ను వరించింది. ఆయన అపారకృపతో జీవితం చల్లగా సాగిపోతుంది.

నా జీవితం పొడవునా ఏది కోరినా సాయి నెరవేరుస్తూ వచ్చారు. ఒక్క మరువలేని సన్నివేశం వ్రాస్తాను. ఏప్రిల్ 1982లో ఒకరోజు అకస్మాత్తుగా నా భార్య నన్ను పిలచి 12, 15 సంవత్సరాల వయసుగల మా యిద్దరు అబ్బాయిలకూ ఉపనయనం చేయాలన్న కోరిక వ్యక్తం చేసింది. అంతేగాదు, మా కుటుంబంలో అదే శుభకార్యం గనుక మా బంధుమిత్రులందరినీ పిలుచుకొని మహావైభంగా శుభకార్యం జరిపించాలని గూడ గట్టిగా కోరినది. ఆమె చెప్పిన ప్రకారం లెక్కవేస్తే ఆ రోజులలోనే ఆ వేడుకకు ₹5000/- ఖర్చు అయ్యేలావున్నది. నాకు నా నెలసరి జీతం తప్ప మరొక ఆదాయమేమిలేదు. ఏమైనా ఆమె కోరిన ఆ ఒక్క కోరికనూ నెరవేర్చక ఆమెను అసంతృప్తి పరచడమిష్టం లేక "సాయి దయతలుస్తే తప్పక అలానే చేద్దాం!" అన్నాను. వెంటనే నా మిత్రుడైన గోపీనాథ్ యింటికి వెళ్ళాను. వారింట ఒక పెద్ద సాయిపటమున్నది. అక్కడ భజన సత్సంగాలూ జరుగుతాయి గనుక అది మాకెంతో పవిత్రమైన చోటు. అక్కడకువెళ్ళి సాయిని ప్రార్థించి, యీ విషయంలో వారి ఆజ్ఞయేమో తెలుసుకోవాలని ఆ పటం ముందు చీట్లు వేసాను. ఆ శుభకార్యానికి ఉపక్రమించమన్న ఆదేశమే వచ్చింది.

ఇంకే! కొండంత ధైర్యంతో వెంటనే నా ప్రయత్నమారంభించాను ఒక వారానికల్లా సాయి భక్తుడైన ఒక మిత్రుడు ₹1500/- అప్పిచ్చాడు. అదే సమయానికి ₹1500/- నాకు ఆఫీసు నుండి అడ్వాన్సుగా వచ్చింది. అంతేగాదు అప్పటికి అయిదు మాసాలుగా తెగని సమస్య తీరి నా సెలవు జీతం తాలూకు ₹1000 సమయానికి అందింది. ఆర్థికంగా అన్ని ఏర్పాట్లు జరిగాయి. కాని వచ్చే బంధుమిత్రులందరికీ సరిపడే విడిది దొరకాలిగదా? నేనీ పైకము అంది నా ప్రయత్నాలు ప్రారంభించేనాటికే ఆ వూరిలో కళ్యాణ మండపాలు, సత్రాలు పెళ్ళిళ్ళకూ, ఉపనయనాలకూ 'బుక్' అయిపోయాయి. కార్యం సరిగా నెరవేరదేమోనన్న భయం కల్గింది. కాని సరిగ సమయానికి ఒక సహృదయుడైన వర్తకుని సాయి ప్రేరేపించారుగాబోలు, మేము అడిగీ అడుగకముందే తమ పెద్ద భవనాన్ని మాకు విడిదిగా యిచ్చాడు. శుభలేఖ శిరిడీకి కూడ పంపాము.

ఆ రోజుకు బంధుమిత్రులందరూ వచ్చారు. గణపతి హోమంతో మే 25, 1982న కార్యమారంభమై వైభవంగా కొనసాగుతోంది. ఇంతగా దయచూచి అనుగ్రహించిన సాయి

మా ఆహ్వానాన్ని పురస్కరించుకొని ఏదో ఒక రూపంలో తప్పక వస్తారని మా అందరి విశ్వాసం. కనుక వంటలూ ఏర్పాట్లు అన్నీ మా తోడల్లుడుగార్కి అప్పగించి ఏ రూపంలోనైనా సాయి రాగలరు గనుక జాగరూకతతో వుండమని హెచ్చరించాను. ఆయన ఆ మాట అంతగా విశ్వసించలేదుగాని, తనకేమాట రాకుండా చూచుకోవాలనిమాత్రం కొంచెం గుర్తుగా గమనిస్తున్నాడు. సరిగా బ్రహ్మోపదేశమ్మైంది. వంటగూడ పూర్తయిందో లేదో ఎవరో ఒక గుర్తు తెలియని సాధువు తిన్నగా పందిరంత తిరిగి తిరిగి మౌనంగా వంటశాలలో ప్రవేశించి నిలబడ్డాడు! ఎవరినీ లోనికి రావడానికి అనుమతి గూడ అడుగలేదు. వెంటనే మాతోడల్లుడు గమనించి, వారే సాయి అని గుర్తించి వారికి మొదట భిక్ష భక్తి శ్రద్ధలతో సమర్పించాడు. దానిని తీసుకొంటూనే ఆయన చిరునవ్వుతో వెళ్ళిపోయాడు!!

నేను ఆహ్వానించినది 250 మందిని. ఏర్పాట్లు గూడ అంతమందికి సరిపడేలాగే చేశాము. కాని వచ్చిన చుట్టపక్కాలందరూ కలసి 5, 6 వందలకు పైన వున్నారు. అయినా ఏ కొరతా, రభసా లేకుండా అన్ని చక్కగా తృప్తిగా జరిగిపోయాయి. అప్పుడు నా అండన వారే నిలిచారు.

- ***జీ.వి. వైద్య***

నేను మద్రాసులో 1950 ప్రాంతాలలో నివసించాను. ఒకనాటి మధ్యాహ్నం శ్రీ రామారావుగారనే వృద్ధులు మా యింటికి వచ్చి వారికి నా పేరు పరిచితమై నన్ను చూడడానికి వచ్చానని చెప్పి మాటల సందర్భములో "మీరు సాయిబాబాను చూశారా?" అన్నారు. నేను చిన్న పిల్లవాడుగా బెంగుళూర్‌లో ఉన్నప్పుడు వారి గురించి విన్నానని చెప్పాను. "అయితే మీరు ప్రతి గురువారం వారిని స్మరించి ఉపవాసముంటూండండి. జీవితాంతము వారి రక్ష మీకు ఉంటుంది" అన్నారు. ఆ మాటకు ఋజువు ఏమిటని అడిగాను.

"అయితే నా అనుభవం చెబుతాను వినండి. నాకు పసితనం నుండీ మూర్ఛవ్యాధి వుండేది. మా తల్లిదండ్రులు ఎన్నో వైద్యాలు చేయించారు గానీ అవి అన్నీ నిష్ప్రయోజనమైనాయి. నాకు వివాహమైనా గూడా నాకు మూర్ఛలు వస్తూండేవి. ఒకరోజు నేను నా భార్య రైల్లో ప్రయాణం చేస్తున్నాము. మా రైలు పెట్టెలో ఒక మూలనుండీ అకస్మాత్తుగా, "ఏయి లే నీకేమయినది?" అన్న గదమాయింపు వినిపించింది. నేను తృళ్ళిపడి తలెత్తి చూచాను. ఆ మూల కాషాయవస్త్రాలు ధరించిన ఒక వ్యక్తి కూర్చుని ఉన్నారు. వారిని చూడగానే నేను ఒక్క గంతున లేచి కూర్చున్నాను. కానీ మరలా చూస్తే ఆ మూల ఎవ్వరూ లేరు! ఆ క్షణం నుండీ నేటి వరకూ నాకు మూర్ఛరాలేదు. కొద్ది రోజుల తర్వాత యిలా జరిగిన సంగతే పూర్తిగా మర్చిపోయాను. తర్వాత ఒక రోజు ఒక మహనీయుని పటం చూచినప్పుడు, అందులో అలనాడు నాకు రైలుపెట్టెలో దర్శనమిచ్చిన సాధువుగారి పోలికలు కన్పించాయి. విచారించిన మీదట వారు శిరిడీ సాయిబాబా అని తెల్సింది. నాకు మూర్ఛవ్యాధి శాశ్వతంగా నివారించి కాపాడినదెవరో ఆ క్షణంలో అర్థమైంది. సాయి అనుగ్రహమంటే యిలా ఉంటుంది".

ఈ లీల చెప్పాక వారు మా యింట్లో భోజనం చేసి వెళ్ళిపోయారు. నేను మరలా వారినెన్నడూ చూడలేదు.

ఆకస్మికంగా శ్రీ రామారావుగారి నుండి సాయి మహిమ గురించి విన్నాక ఒక సాయిబాబా పటం కొని యింటిలో పెట్టుకోవాలనుకున్నాను. రెండు రోజుల తర్వాత మట్టితో చేసిన వివిధ దేవతామూర్తుల విగ్రహాలనమ్మే వాడు మా యింటి ముందుకు వచ్చాడు. వాటిలో చక్కని సాయిబాబా మూర్తి గూడా ఉండడం నేనూ, నా భార్యా గమనించాము. దాన్ని కొని మా యింటిలో పూజా మందిరములో పెట్టుకొన్నాము. నాడు మా యింటికి మా సద్గురువొచ్చారని తలచి సేవించుకోనారంభించాము. తర్వాత ఉద్యోగరీత్యా మద్రాసు నుండీ పంజాబ్ రాష్ట్రానికి, తర్వాత బెంగుళూర్‌కు బదిలీ అయ్యాము. మా సామానంతా ఒక చోటి నుండీ యింకొకచోటుకు తరలించినప్పుడు మా పూజలోని యితర దేవతా విగ్రహాలన్నీ విరిగిపోయినప్పటికి సాయిబాబా విగ్రహం మాత్రం చెక్కు చెదరకపోవటం మాకు విశేషమన్పించింది. మేము విగ్రహం యింట్లో పెట్టుకున్నప్పటి నించీ ప్రతి గురువారం ఉపవసిస్తూనే ఉన్నాము.

- ***రచయిత విఠల్‌రావ్ పవార్,***
బెంగుళూర్.

ఆచార్యుని అద్భుత లీలలు

పూజ్యశ్రీ భరద్వాజ మహరాజ్ లీలావైభవాన్ని సూళ్లూరుపేటకు చెందిన మోహనరెడ్డిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు --

పూజ్యశ్రీ మాస్టరుగారు నాకు 13 లేక 14 సంవత్సరముల వయసు వున్నప్పటినుంచి పరిచయం. వారు సూళ్లూరుపేటకు వస్తూండేవారు. వారిని ఊరేగింపుగా తీసుకుని వచ్చేవారు. మాకందరికి ఆయన దేవుడు. ఆయన వస్తే మాకు పండుగలాగా వుండేది. పూజ్యశ్రీ మాస్టరుగారి సన్నిధి అందరికీ ఎంతో ఆనందదాయకంగా వుండేది.

ఇలాగే ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారు వచ్చినప్పుడు వారు పడుకుని వుంటే కాళ్ళు పడుతున్నాను. ఒక అర్ధగంట దాటింది. ఆయన, 'ఇంక చాలు!' అనరు, నాకేమో చేతులు నొప్పి పుడుతున్నాయి. అప్పుడు నేను చిన్న పిల్లవాడిని. ఇలా అనుకోగానే కొంతసేపటికి లేచారు. తరవాత వారికి అందరం కలిసి స్నానం చేయించాము. హారతి ఇచ్చాము. పూలమాలలు వేసి నమస్కారం చేసుకున్నాము. ఆయన అందరినీ సమానంగా ప్రేమించేవారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు విద్యానగర్ లో వున్నప్పుడు ఎక్కువగా వారి దగ్గరికి వెళుతుండేవాళ్ళం. ఏవో చాలా ప్రశ్నలు అడగాలని వెళ్ళేవాడిని. అప్పటికే ఒకరిద్దరు వుండేవారక్కడ. ఆయన వారితో సత్సంగం చేస్తూంటే నాకు కావలసిన సమాధానం వచ్చేసేది!

ఆయనకి మన మనసులో ఏముందో తెలిసి పోయేది! మనిషిని చూడగానే వాళ్ళ మనసుని చదివేసేవారు. ఆయన మాకు నడిచే దేవుడు. నేను నా కళ్ళని , నా నుదిటిని వారి పాదాలకు ఆనించి నమస్కారం చేసుకునేవాడిని. ఒకచేత్తో ఊదీ పెట్టి, ఇంకొక చేతితో వీపు మీద తట్టేవారు.

పూజ్యశ్రీ మాస్టరుగారిది చాలా ఆకర్షణీయమైన రూపం. ఎర్రటి మేనిఛాయ, చమక్ మని మెరిసే కళ్ళు, చూస్తుంటే అలాగే చూడాలనిపించేది. శాంతి అనుభవించాలంటే ఆయన దగ్గరకి వెళ్లి కూర్చుంటే చాలు, ఎంతో ప్రశాంతంగా వుండేది. ఆయన దగ్గరనుంచి వచ్చేసేటప్పుడు వెనక్కి వెనక్కినడుస్తూఆయననిచూసుకుంటూ వచ్చేవాళ్ళం. వారు ధరించే గళ్ళ లుంగీలు మా సూళ్లూరుపేట నుంచే తీసుకుపోయేవాళ్ళం. ఆయన కాల్చే సిగరెట్లు కూడా సమర్పించుకొనేవాళ్ళం. నేను కాలేజీ చదువుకి వచ్చాక సిగరెట్లు కాల్చడం అలవాటయ్యింది. ఒకసారి కలలో పూజ్యశ్రీ మాస్టరుగారు ఈ విషయమై మందలించారు. ఇక అప్పటినించి కాల్చడం మానుకున్నాను.

ఒకసారి సమ్మేళనం నెల్లూరులో పెట్టాలా, సత్యవేడులో పెట్టాలా అని తర్జన భర్జన జరుగుతోంది. ఎటూ తేల్చుకోలేకుండా వున్నాము. అప్పుడు కలలో పూజ్యశ్రీ మాస్టరుగారు నెల్లూరు వచ్చినట్లు, మేము పాదనమస్కారం చేసుకోగానే, "పదండి, చాలామంది వచ్చారు. వాళ్లందరికీ భోజన ఏర్పాట్లు చేయాలి" అని వారు కూడా మాతోపాటు కలిసి వడ్డించినట్లు దర్శనమైంది. అప్పుడు నెల్లూరులోనే సమ్మేళనం చేశాము.

పూజ్యశ్రీ మాస్టరుగారి దయవలన వెంకయ్యస్వామి, చివటం అమ్మ, రామిరెడ్డి తాత దర్శనం చేసుకున్నాము. అలాగే ఒకసారి కాళహస్తిలో వుండే గోపాలస్వామిని దర్శించుకోవడానికి వెళ్లాను. ఆయన ఒక చోట వుండరు. ఎక్కడెక్కడో తిరుగుతూ వుంటారు. అటువంటి సమయంలో పూజ్యశ్రీ మాస్టరుగారిని హృదయపూర్వకంగా స్మరించుకోగానే వెంటనే ప్రత్యక్షమయ్యేవారు! ఒకొక్కసారి ఆయన అటు తిరిగివుంటే పూజ్యశ్రీ మాస్టరుగారిని తలుచుకోగానే వెంటనే ఇటు తిరిగేవారు! పూజ్యశ్రీ మాస్టరుగారికి, వాళ్లకీ భేదమే

లేదనిపించేది.

ఈరోజు నేను ఇలా చెప్పడం కూడా పూజ్యశ్రీ మాస్టరుగారి లీలే! కారణం, లీలలు చెప్పమంటే ఇప్పుడు ఏమి చెప్పగలను? చాలా కాలం అయిపోయింది కదా, తరవాత చూద్దామనుకొన్నాను. ఆ రోజు పారాయణ గ్రంథమైన 'మహాత్ముల ముద్దుబిడ్డడు' తెరిచాను. దానిలో విజయవాడలో వున్న రత్నకుమారిగారి అనుభవం వచ్చింది. పూజ్యశ్రీ మాస్టరుగారు ఆవిడని, "బాబా అనుభవాలు ఒక డైరీలో వ్రాసి పెట్టుకోమ్మా!" అంటే, "ఎందుకు మాస్టరుగారు? నాకు తెలుసు, ఆయనకు తెలుసు కదా!" అంటారు. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, "అలా అనుకుంటే ఈనాడు బాబా చరిత్ర వచ్చేదే కాదు!" అంటారు. అది చదివాక నాకు, 'నిజమే కదా! ఇంతటి మహోపకారం చేసిన వారి గురించి చెప్పకపోతే ఒకరకంగా ద్రోహం చేసిన వారమౌతామ'ని అనిపించి, ఇలా పూజ్యశ్రీ మాస్టరుగారి అనుభవాలు మీతో పంచుకోవడం జరిగింది.

నా చిన్నతనంనుంచి ఇప్పటివరకు నా జీవితంలో జరిగిన అన్ని విషయాలలోనూ పూజ్యశ్రీ మాస్టరుగారి అనుగ్రహం అనుభవిస్తూనే వున్నాను. మనస్ఫూర్తిగా ఒక్కసారి వారి పాదాలు పట్టుకుంటే చాలు, ఎప్పటికీ వారు మనలను వదలరు. వారు విద్యానగర్ నుంచి ఒంగోలు వెళ్ళాక ఎక్కువగా కలవలేకపోయాను. ఇప్పటికీ మాలో కొంతమందిమి చాలా బాధపడుతూ వుంటాము. 'అంతటి దత్తావతారం మనకు లభిస్తే చాలావరకు లౌకికమైన వాటికే ఉపయోగించుకున్నామే!' అని. దేవుడికి ఎలా దణ్ణం పెట్టాలో నేర్పించింది ఆయన. ఈనాడు ఇంతమాత్రం క్రమశిక్షణతో, సంస్కారంతో బ్రతుకుతున్నామంటే కారణం ఆయన. పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లి కూడా అంతటి కరుణామయురాలు. అటువంటి దంపతులని ఇక ఎప్పుడూ చూడబోము. వారు ప్రపంచానికి సాయి ప్రసాదించిన ఒక వరం. సర్వకాల సర్వావస్థలయందు వారి కృపాశీస్సులు మాపై ఎల్లప్పుడూ వుండాలని కోరుకుంటూ, కృతజ్ఞతాపూర్వక నమస్సులు తెలియచేసుకుంటున్నాను.

ఒంగోలుకు చెందిన శ్రీమతి రాధా మనోరంజని దేవి గారు పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ లీలావైభవాన్ని ఈ విధంగా తెలియచేస్తున్నారు---

మాది ఒంగోలు. మావారు టీచర్. సుమారు 2007 లో వ్యక్తిగత కారణాలవలన మావారు నన్ను విడిచి మా అత్తగారింట్లోనే వుండేవారు. నాకు చాలా బాధగా వుండేది. ఇదివరకు నేను ప్రతిరోజూ బాబా మందిరానికి వెళ్ళేదానిని. కొంతకాలం నుంచి సమస్యలు ఎదుర్కొంటూ గుడికి వెళ్ళలేదు.

ఎందుకో ఒకరోజు వెళ్లాలనిపించి బాబాగుడికి వెళ్ళాను. అక్కడ పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు వ్రాసిన 'శ్రీ సాయి లీలామృతం' గ్రంథం చదవాలనిపించి కొనుక్కున్నాను. అక్కడివాళ్ళు అందరూ, "గురువారం నుంచి పారాయణ మొదలుపెట్టండి!" అని చెప్పారు. కానీ నేను కొనిన రోజునే అంటే బుధవారం రాత్రి 8-30కు ఆ గ్రంథాన్ని చదవడం మొదలుపెట్టాను. పుస్తకం ఒకసారి చదవడం పూర్తయింది.

ఒక వారం రోజుల తర్వాత నేను బాధపడుతూనే నిద్రపోయాను. అప్పుడు నాకొక స్వప్నం వచ్చింది. బాబా మావారి చెయ్యి పట్టుకుని వస్తున్నారు. కళ్ళు తెరిచి చూస్తే అది కల మాత్రమే. ఇలా అదే స్వప్నం తెల్లవార్లూ చాలాసార్లు వచ్చింది. ఉదయం నిద్రలేచేటప్పటికి మావారు తనంతట తానే నా దగ్గరకు వచ్చేశారు. ఇది జరిగి సుమారు పన్నెండు ఏళ్ళు కావస్తోంది. శ్రీ సాయి లీలామృతము పారాయణ వల్ల నాకు ఇంత మంచి జరిగింది. ఇంతటి మహిమ గల పవిత్రగ్రంథాన్ని మనకు అందించిన పూజ్యశ్రీ మాస్టరుగారు ఎంతో గొప్పవారు. ఆయనకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను?

నాకు ఎటువంటి సమస్య వచ్చినా ఒకసారి 'శ్రీ సాయి లీలామృతము' గ్రంథం పారాయణ చేసుకుంటే చాలా ప్రశాంతముగా వుంటుంది.

పూజ్యశ్రీ మాస్టరుగారిని సశరీరంగా నేను దర్శించలేకపోయాను. ఒంగోలులో వుండి కూడా ఆయనను చూడలేకపోయానే అని చాలా బాధగా వుంటుంది. నేను వారిని దర్శించకున్నా, పూజించకున్నా వారు నా కుటుంబాన్ని నిలిపారు. ఆయన చేసిన మేలు నేనెన్నటికీ మర్చిపోలేను.

నాకు ఏ సమస్య ఎదురైనా బాబాను, పూజ్యశ్రీ మాస్టరుగారిని ప్రార్థిస్తాను. ఆ సమస్యలు తీరిపోతాయి.

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర	450-00
శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర	90-00
శ్రీ సాయి లీలామృతము	99-00
శ్రీ గురు చరిత్ర	99-00
శ్రీ సాయి సన్నిధి	120-00
శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు	125-00
శ్రీ సాయినాథ ప్రబోధామృతము	80-00
సాయినాథ పూజ	40-00
సాయినాథ స్థవనమంజరి	10-00
శిరిడి ఆరతులు	15-00
సాయిబాబాను సేవించడమెందుకు	10-00
సత్సంగము-భజన	5-00
శిరిడి క్షేత్ర సందర్శనము	40-00
విజ్ఞాన వీచికలు	99-00
పరిప్రశ్న	99-00
మతమెందుకు?	50-00
ఏది నిజం?	50-00
ధ్యానయోగ సర్వస్వం	99-00
బుద్ధధ్యాన హృదయం	49-00
దత్తావతార మహత్యం	75-00
సంహితాయన గురు ద్విసాహస్రి	128-00
పురుషసూక్త రహస్యం	40-00
సాయిసూక్తి-ఆచార్యవాణి	10-00
శ్రీ పాకలపాటి గురువుగారు	49-00
అవధూత శ్రీ చీరాల స్వామి	49-00
అవధూత శ్రీ వెంకయ్యస్వామి	70-00
శ్రీ ఆనందమాయి అమ్మ	49-00
టిబెట్ యోగి మిలారేపా చరిత్ర	80-00
శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర	49-00
స్వామి సమర్థ(అక్కల్కోట స్వామి)	49-00
మనము-మన సంస్కృతి	70-00

ఇతర ప్రచురణలు

మహాత్ముల ముద్దుబిడ్డడు	120-00
అవధూత చివటం అమ్మ	70-00
శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర	70-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు	125-00
మరో నందదీపం	80-00
ఆచార్య అమృత లేఖావళి	40-00
భగవాన్ శ్రీ భరద్వాజ	175-00
బాలల శ్రీ సాయి లీలామృతము	25-00
మహాపురుషుడు	50-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు (2)	125-00
బాలల శ్రీ సాయి సన్నిధి	50-00

BOOKS IN ENGLISH

Sai Baba the Master	175-00
Sree Guru Charitra	99-00
Supreme Master(Swami Samartha)	99-00
Sai Baba of Shiridi and His Teachings	99-00
Life and Teachings of Hazarat Tajuddin Baba	99-00
Children's SaiBaba the Master	60-00

BOOKS IN OTHER LANGUAGES

Sadguru Sai Baba(Hindi)	150-00
Sai Leelamrutham(Kannada)	150-00
Sai Baba Jeevitha Charitham(Malayalam)	220-00
Sai Baba Leelamrutham(Tamil)	175-00
Sri Guru Charitra (Hindi)	99-00
Swami Samartha (Kannada)	99-00
Sri Guru Charitra(Kannada)	45-00
Shiridi Aarathi(Tamil)	15-00
Stavana Manjari(Tamil)	10-00
Tibet Yogi Milarepa Jeevitha Charitra(kannada)	55-00
Sri Sainath Prabodhamruthamu (Kannada)	65-00

SRI GURUPADUKA PUBLICATIONS, c/o SRI MANGA BHARADWAJA TRUST,
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : +91 - 74160 41550
Branch Office: Kondaiah Bunk Street, Kothapet, Ongole, Prakasam Dt., Andhra Pradesh.
Phone: 08592 233271
Send DD in favour of "Sri Manga Bharadwaja Trust(Publications)", payable at Hyderabad or Ongole.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.

ఒంగోలు (గుమ్మళంపాడు) లో విరాజమానులైవున్న పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు
మంగమ్మ తల్లి సన్నిధానంలో అక్టోబరు 30, 2021 న జరిగిన
పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గురుదేవుల జన్మదినోత్సవ వేడుకలు

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET,
KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.